నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
1
సోమవారం | 04 నవంబర్ 2024 | www.navatelangana.com

యాదవుల సాంస్కృతికి ప్రతీక సదర్ ఉత్సవాలు



నవ తెలంగాణ-పటాన్ చెరు: యాదవుల సాంస్కృతికి ప్రతీక సదర్ ఉత్సవాలని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఆదివారం రాత్రి పటాన్‌చెరు పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు మెట్టు రాజు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతు సదర్ ఉత్సవాలు యాదవుల ఐక్యతను జంతువుల పట్ల వారికున్న ప్రేమను వారి జీవన విధానాన్ని చాటుతాయని తెలిపారు. పాడి పరిశ్రమ ద్వారా ఉపాధి పొందుతున్న యాదవ సోదరులు పశువుల సంతతి పెరగడానికి దున్నపోతులను పవిత్రంగా చూడడం ఈ సదర్ సమ్మేళన ప్రత్యేకత అన్నారు. యాదవుల సాంస్కృతికి ప్రతీక అయిన సదర్ వేడుకలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారిక పండగగా ప్రకటించారని గుర్తు చేశారు. సదర్ ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన పులి రాజు నృత్యాలు, దున్నపోతుల విన్యాసాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి ఈ కార్యక్రమంలో రామచంద్రపురం కార్పొరేటర్ పుష్ప నాగేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి, జలిగిరి దేవరాజ్, మెట్టు కృష్ణ యాదవ్, తలారి మధు,రవి,శ్రీనివాస్,వెంకటేశ్, యాదవ సోదరులు, తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో ఘనంగా సదర్ ఉత్సవం

నవతెలంగాణ-రామచంద్రాపురం



రామచంద్రాపురం పట్టణంలోని సండే మార్కెట్ ప్రాంగణంలో శనివారం సాయంత్రం సదర్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు రాజు ఆధ్వర్యంలో సదర్ ఉత్సవాన్ని ఘనం గా నిర్వహించారు. రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నాగష్ మాజీ కార్పొరేటర్ అంజయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆదర్శ్ రెడ్డి, గ్రామ పెద్దలు కరికే సత్యనా రాయణ, శ్రీనివాస్ గౌడ్, వివిధ పార్టీల నాయకులు తదితరులు ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. సదర్ ఉత్సవం సందర్భంగా దున్నపోతుల విన్యా సాలు, ఆటలు, పాటలు మరియు ప్రాంగణమంతా విద్యుత్ దీపాలతో నిర్వాహకులు ఘనంగా అలంకరించారు. సదర్ ఉత్సవానికి వచ్చిన ప్రముఖులను ఈ సందర్భంగా నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

టీటీడీ చైర్మెన్ బీఆర్ నాయుడుని కలిసిన పట్నం మాణిక్యం

నవతెలంగాణ-సంగారెడ్డి



నూతనంగా ఎన్నికైన టీటీడీ చైర్మెన్ బీఆర్ నాయుడుని హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన కార్యాలయంలో డీసీసీబీ ఉమ్మడి మెదక్ జిల్లా వైస్ చైర్మెన్ పట్నం మాణిక్యం ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూల గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మాణిక్యంతోపాటు ఆర్సిపురం శ్రీనివాస్ గౌడ్, ప్రేమానందం తదితరులు ఉన్నారు.



కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ స్టేట్ కమిటీలో సంగారెడ్డి వాసులకు చోటు

నవతెలంగాణ-సంగారెడ్డి

సీసీఆర్ సెంట్రల్ కార్యాలయం హైదరాబాద్ ఆదివారం సీసీఆర్ వర్క్ షాప్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కౌన్సిల్ ఫర్ సిటిజన్స్ రైట్ వ్యవస్థాపక అధ్యక్షులుగా మంచి కట్ల అనిల్ కుమార్ చేతుల మీదుగా సంగారెడ్డికి చెందిన ఎండి.అహ్మద్‌కి స్టేట్ జాయింట్ సెక్రటరీ, అశోక్ కుమార్‌కి జిల్లా కో ఆర్డినేటర్‌గా నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సోల్కంపల్లి ప్రభ, సెంట్రల్ కమిటీ ఇన్చార్జ్ తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 7న ఏఎంసీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం

నవతెలంగాణ-వట్‌పల్లి

మండల కేంద్రంలోని రాజనర్సింహ వ్యవసాయ మార్కెట్ ఆవరణంలో వట్‌పల్లి ఏఎంసీ పాలకవర్గం ఈనెల 7న కొలువు తీరనున్నది. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్యఅతిథిగా వైద్య ఆరోగ్యశాఖ మంత్రివర్యులు దామోదర్ రాజ నర్సింహ హాజరుకానున్నట్లు పాలకవర్గం నూతన కమిటీ తెలిపింది. ఈ నేపథ్యంలో వ్యవసాయ మార్కెట్‌ను సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి మంత్రితో పాటు నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్, మెదక్ ఎమ్మెల్యే రోహిత్ హాజరవుతారన్నారని ఏఎంసీ చైర్మెన్‌గా పదవి బాధ్యతలు చేపట్టనున్న కొప్పుల లక్ష్మి శేషారెడ్డి తెలిపారు.



డైట్, కాస్మోటిక్ ఛార్జీల పెంపుపై విద్యార్థుల హర్షం

నవతెలంగాణ-సంగారెడ్డి

సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ హాస్టల్స్‌కి డైట్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచటంపై సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఆనంద నిలయం హాస్టల్ సమీకృత బాలుర వసతి గృహంలో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఫ్లకార్డ్స్ ప్రదర్శనతో మిఠాయిలు ఒకరికొకరు పంచుకుంటూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వసతి గృహ సంక్షేమ అధికారులు నాగేశ్వరరావు, మల్లికార్జున్ ప్రభుత్వం పెంచిన చార్జెస్ వివరాలను విద్యార్థులకు వివరించారు. గతం కంటే 40 శాతం పెంపుదల చేయడం పట్ల విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సహాయ సాంఘిక సంక్షేమ అధికారి బి.శంకర్, నాలుగో తరగతి సిబ్బంది పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

నవతెలంగాణ-రామచంద్రాపురం



(ఫైల్)

రోడ్డు దాటుతున్న మహిళను బైక్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలై మృతి చెందింది. ఈ ఘటన రామచంద్రాపురం పట్టణంలో ఆదివారం జరిగంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన చంద్రకళ(50) ఆదివారం ఉదయం సుమారు 7:30 గంటల ప్రాంతంలో జాతీయ రహదారిపై డైమండ్ పాయింట్ దగ్గరలో రోడ్డు దాటుతున్నది. అదే సమయంలో పటాన్చెరు పట్టణంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన షేక్ షఫీ పటాన్చెరు వైపు నుంచి బైక్‌పై రామచంద్రాపురం వచ్చి యూటర్న్ తీసుకొని అతివేగం, అజాగ్రత్తగా నడుపుతూ చంద్రకళను ఢీకొట్టాడు. దాంతో ఆమె కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను పటాన్చెరులోని ప్రభుత్వాసుపత్రికి తరలించి ఆమె కొడుకు భార్గవ్‌కు సమాచారం అందించారు. మెరుగైన వైద్యం కోసం ఆమెను ధ్రువ హాస్పిటల్ లో చేర్పించగా చికిత్స పొందుతూ 11 గంటల ప్రాంతంలో మృతిచెందింది. మృతురాలి కొడుకు భార్గవ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

టీ యూడబ్ల్యూజే అధ్యక్షునికి సన్మానం



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లా (టీయూడబ్ల్యూజే-ఐజేయు) తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ అధ్యక్షులు బండారు యాదగిరిని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రమాణస్వీకారం వైకుంఠపురం శివారు వాసవి మహాసంస్థాన్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీజీపీసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్పర్సన్ కల్వ సుజాత, రాష్ట్ర మహాసభ ఉపాధ్యక్షుడు తోపాజి అనంత కిషన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా టియుడబ్ల్యూజే ఐజేయు అధ్యక్షుడు బండారు యాదగిరిని శాలువా కప్పి సత్కరించి, మెమోంటో అందజేశారు. సంఘానికి, జర్నలిస్టుల సంక్షేమానికి పాటుపడుతున్నందుకు అభినందించారు. వాసవి మాత ఆశీస్సులతో మున్ముందు మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. తనకు జరిగిన సత్కారానికి యాదగిరి ధన్యవాదాలు తెలిపారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మునిగాల మాణిక్ ప్రభు, నూతనంగా ఎన్నికైన పట్టణ అధ్యక్షుడు కొంపల్లి విద్యాసాగర్, ప్రెసిడెంట్ చంద్రశేఖర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి నామాభాస్కర్, కోశాధికారి ఆమెటి భాస్కర్, పూర్వ అధ్యక్షుడు పాంపాటి కృష్ణమూర్తి, ఆమెటి పాండయ్య, వాసవి క్లబ్ ముఖ్యులు చందా శ్రీధర్ పుల్లూరు ప్రకాష్, ఇరుకుల ప్రదీప్, కుందారం రాజయ్య, ఆమేటి మహేందర్ పుట్నాల లక్ష్మణ్, తహశీల్దార్ సతీష్, మాచర్ల సతీష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై... నిరంతర పోరాటాలు



- ముగిసిన మెదక్ జిల్లా మహాసభలు
- 15 మందితో జిల్లా నూతన కమిటీ ఎన్నిక
- జిల్లా కార్యదర్శిగా కడారి నర్సమ్మ ఏకగ్రీవం
- పలు తీర్మానాల ఆమోదం...
- ఒకే కుటుంబం నుంచి ప్రతినిధులు హాజరు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

రాబోయే కాలంలో ప్రజలెదుర్కొంటున్న సమస్యలపై నిరంతర పోరాటాలు నిర్వహించాలని సీపీఐఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు పిలుపు నిచ్చారు. తూప్రాన్ పట్టణంలో రెండు రోజుల పాటు నిర్వహించిన సీపీఐఎం మెదక్ జిల్లా 15వ మహాసభలు ఆదివారం విజయవంతంగా ముగిశాయి. ఈ మహాసభల్లో పరిశీలకులుగా పాల్గొన్న ఆయన ప్రతినిధుల సభలో మాట్లాడారు. మెదక్ జిల్లా పారిశ్రామిక ప్రాంతంలో కార్మిక వర్గం అనేక సమస్యలు ఎదుర్కొంటుందన్నారు. పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, సదుపాయాల్లేవన్నారు. ముఖ్యంగా వలస కార్మికులతో యాజమాన్యాలు వెట్టి చేయిస్తూ శ్రమ దోపిడికి గురి చేస్తున్న పరిస్థితి ఉందన్నారు. కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలని సీపీఐఎం పోరాటాలు సాగించాలన్నారు. అదే విధంగా బీడీ తయారీ రంగంలో వేలాది మంది కార్మికులు, మహిళల శ్రమను కంపెనీలు దోచుకుంటున్నాయన్నారు. ప్రభుత్వాలు విధించే జీఎస్టీ భారాల్ని కూడా కార్మికులపైన తోసి దోపిడికి పాల్పడుతున్న దుర్మార్గమైన పరిస్థితులున్నాయన్నారు. మరో పక్క వ్యవసాయాధారంగా ఉన్న ప్రాంతాల్లో రైతులకు గిట్టుబాటు ధర, రుణాలు ఇతర సమస్యలున్నాయన్నారు. అటవీ భూముల్ని సాగు చేసుకుంటున్న అర్హులైన వారందరికీ హక్కు పత్రాలివ్వాలని సీపీఐఎం పోరాడిందని, ఆ పోరాటాల్ని మరింత ముందుకు తీసుకెళ్లాలన్నారు. దళితులు, గిరిజనులతో మమేకమై వారెదుర్కొంటున్న సామాజిక వివక్ష, ఆర్థిక దోపిడికి సంబంధించిన అంశాలపై కేంద్రీకరించిన పని చేయాలన్నారు. మహిళల రక్షణ, సమాన పనికి సమాన వేతనం వంటి సమస్యలపైన కూడా ఉద్యమాలు చేయాలన్నారు. స్కీమ్ వర్కర్లల్లో మహిళలే అధికంగా ఉన్నందున వారి జీతభత్యాలు, పర్మినెంట్ వంటి సమస్యలపై మరింత సమశీలంగా ఉద్యమించాలన్నారు.

పార్టీ విస్తరణ కోసం నిరంతర కృషి సాగాలి

: జయలక్ష్మి, సీపీఐఎం రాష్ట్ర కమిటీ సభ్యులు



మెదక్ జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల్లోనూ ఎర్రజెండాను ఎగురవేసేలా పార్టీని విస్తరించేందుకు నిరంతర కృషి కొనసాగాలని సీపీఐఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జయలక్ష్మి అన్నారు. రెండు రోజుల పాటు మహాసభల్లో చర్చించిన పలు అంశాలు, ఆమోదించిన తీర్మానాలు, రూపొందించిన భవిష్యత్ కర్తవ్యాలను ముందుకు తీసుకెళ్లేందుక నూతన కమిటీ పనిచేయాలని సూచించారు. ఉత్పత్తి రంగంలో శ్రమటోడ్చి పనిచేస్తున్న కార్మికులు, కర్షకులు, రైతులు, పేదలు, మహిళలు, దళితులు, గిరిజనులు, మైనార్టీల పక్షాన సీపీఐఎం తప్ప మరే పార్టీలూ పనిచేయవన్నారు. రాబోయే కాలమంతా పోరాటాలు, ఉద్యమాల కాలమని అన్నారు.

జిల్లా కార్యదర్శిగా కడారి నర్సమ్మ ఏకగ్రీవ ఎన్నిక

సీపీఐఎం మెదక్ జిల్లా నూతన కార్యదర్శిగా కడారి నర్సమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహాసభల్లో భాగంగా ఆదివారం 15 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా నర్సమ్మ, కార్యదర్శి వర్గ సభ్యులుగా ఎ.మల్లేశం, బస్వరాజ్, కె.మల్లేశం, ఎ.మహేందర్‌రెడ్డి, బి.బాలమణితో పాటు జిల్లా కమిటీ సభ్యుల్ని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

ఒకే కుటుంబం నుంచి ఇద్దరిద్దరు ప్రతినిధులు

సీపీఐఎం మెదక్ జిల్లా మహాసభలకు పార్టీ ఎంపిక చేసిన ప్రతినిధులు హాజరయ్యారు. వారంతా పార్టీ, ప్రజా సంఘాల్లో అనేక పోరాటాలు, ఉద్యమాల్లో నిరంతరం పనిచేస్తున్న వారే కావడం విశేషం. మహాసభకు హాజరైన ప్రతినిధుల్లో ఒకే కుటుంబం నుంచి ఇద్దరు కూడా ఉన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శిగా మూడు పర్యాయాలు బాధ్యతలు నిర్వహించిన ఎ.మల్లేశంతో పాటు ఆయన భార్య ఎ.కమల కూడా ప్రతినిధిగా మహాసభల్లో పాల్గొన్నారు. పార్టీ నూతన జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన కడారి నర్సమ్మతో పాటు ఆమె సోదరుడైన పార్టీ నర్సాపూర్ ఏరియా కార్యదర్శి కడారి నాగరాజు కూడా మహాసభ ప్రతినిధులుగా ఉన్నారు. ఇద్దరు కూడా జిల్లా కమిటీలో ఉండడం విశేషం. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.మల్లేశం ఆయన సోదరుడు కె.కొమరయ్య కూడా ప్రతినిధులుగా పాల్గొన్నారు. అదే విధంగా కె.ప్రవీణ్, కె.మల్లేశం తండ్రికొడుకులు కూడా జిల్లా మహాసభల ప్రతినిధులుగా హాజరయ్యారు. కమ్యూనిస్టు పార్టీ ఉద్యమంలో కుటుంబమంతా అంకిత భావంతో పనిచేస్తూ ఎంతో స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

కష్టజీవుల పక్షాన నిలవాలి

ఎం.అడివయ్య, , సీపీఐఎం రాష్ట్ర కమిటీ సభ్యులు



కష్టజీవుల జీవితాల్లో వెలుగులు నింపే దిశగా ఎర్రజెండా పార్టీ వారి పక్షాన నిలబడి పనిచేయాలని సీపీఐఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.అడివయ్య అన్నారు. మహాసభలకు పరిశీలకులుగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. కార్మికులు, రైతులు, గ్రామీణ పేదల బతుకుల్లో ఏలాంటి మార్పులు రావట్లేదన్నారు. పాలకులు అనేక సంక్షేమ పథకాలిస్తున్నామని చెబుతున్నా ఇన్నేళ్ల కాలంలో ఇంకా ఎందుకు పేదరికంలోనే మగ్గుతున్నారని ప్రశ్నించారు. అందుకే పేదలు, ధనికులనే తేడాల్లేని సమాజం కోసం కష్టజీవులంతా పోరాటాల్లోకి రావాలని పిలుపు నిచ్చారు. పెట్టుబడిదారుల చేతుల్లో అధికారం ఉన్నంత కాలం దోపిడి కొనసాగుతునే ఉంటదన్నారు. దోపిడిలేని సమాజం కేవలం ఎర్రజెండా నాయకత్వాన మాత్రమే సాధ్యపడుతుందన్నారు.

కార్పొరేషన్‌తో నిరుపేద ఆర్యవైశ్యులకు సహకారం

ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత

నవతెలంగాణ-సంగారెడ్డి

ఆర్యవైశ్య కార్పొరేషన్ ద్వారా నిరుపేద వైశ్యులకు సహకారం కాల్వ అందిస్తామని ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కల్వ సుజాత అన్నారు. సంగారెడ్డిలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభు త్వంలో పదేండ్లు పోరాటం చేసినా.. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయలేదని విమర్శించారు. కార్పొరేషన్ కోసం తాను ముందుండి పోరాటం చేసినట్లు పేర్కొన్నారు. కాంగ్రె స్ ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇవ్వకుండా మొదటి సారి ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసిందన్నారు. 8వ తేదీన తాను కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా ప్రమాణస్వీకారం రోజున సికింద్రాబాద్ నుంచి అరణ్య భవన్ వరకు నిర్వహి ంచే ర్యాలీకి ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. మన బలం చూపితే కార్పొరేషన్‌కు ప్రభుత్వం నిధు లు కేటాయిస్తుందన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్య మంత్రిగా ఉన్న సమయంలో వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయాలను ఎండోమెంట్ నుంచి తప్పిస్తూ జీవో ఇచ్చినట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాట ఇచ్చిందంటే నెరవేర్చి తీరుతుందన్నారు. టీజీపి ఐసి చైర్‌పర్సన్ నిర్మల రెడ్డి మాట్లాడుతూ.. ఆర్యవైశ్యులకు తాను ఎప్పటికీ అండగా ఉంటారన్నారు. సేవా కార్యక్రమాలు ఆలయాల నిర్వహణలో ఆర్యవైశ్యులు ఎప్పటికీ ముందుంటారన్నారు. ఈ కార్యక్ర



మానికి తాను హాజరు కావడం అదృష్టంగా భావి స్తున్నట్టు చెప్పారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోపాజి అనంత కిషన్ మాట్లాడుతూ.. దేశంలోనే అతిపెద్ద గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చెప్పడం ఆర్యవైశ్యులకు గర్వకారణమన్నారు. నూతన కార్యవర్గానికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. నూతన అధ్యక్షుడిగా కొంపల్లి విద్యాసాగర్ , వర్కింగ్ అధ్యక్షులుగా మాదంశెట్టి పూర్ణచందర్, కార్యదర్శిగా నామ భాస్కర్, కోశాధికారిగా



ఆమెటి భాస్కర్, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి గంప శ్రీనివాస్, వ్యవస్థాపక జిల్లా అధ్యక్షుడు జూలకంటి లక్ష్మణ్, జి ల్లా అధ్యక్షుడు మణిగాల మాణిక్ ప్రభు, కోశాధికారి బొమ్మ చంద్రశేఖర్, కేయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు బండారి యాద గిరి, వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు బుచ్చిలింగం, ఆర్యవైశ్య మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి తోపాటు తేజవ తి, జిల్లా అధ్యక్షురాలురజని, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు హరీష్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆటలతో శ్రమజీవుల్లో మానసిక ఉల్లాసం

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు, శాండ్విక్ యూనియన్ అధ్యక్షులు చుక్క రాములు
- శాండ్విక్ 40వ వార్షికోత్సవం సందర్భంగా వాలీబాల్ పోటీలు

నవతెలంగాణ-పటాన్‌చెరు



ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో శ్రమజీవుల్లో మానసిక ఉల్లాసం కలిగిస్తాయని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు, ఎస్ఈయు అధ్యక్షులు చుక్క రాములు అన్నారు. పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలో గల శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ అనుబంధంగా ఐక్యంగా ఒకే నాయకత్వంలో 40ఏండ్లు(1985-2025) పూర్తి చేసుకుంటున్న సందర్భంగా 40వ వార్షికోత్సవం కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం మండలంలోని పోచారం గ్రామ పరిధిలో గల స్విచ్ స్పోర్ట్స్ స్టేషన్ మైదానంలో కార్మికులకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు.ఈ పోటీల్లో చుక్క రాములు ముఖ్య అతిథిగా పాల్గొని టాస్ వేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఒక పరిశ్రమలో 40 ఏండ్లపాటు ఒకే నాయకత్వంలో కార్మికులను ఐక్యంగా నిలబెట్టి ఇతరులకు సాధ్యం కాని అనేక అద్భుత విజయాలు సాధించడమనేది చారిత్రాత్మ కమన్నారు. కార్మిక సంక్షేమం కోసం రాజీలేని పోరాటం, పరిశ్రమలో నూతన కార్మికులు రావడానికి యూనియన్ నాయకత్వం ఎప్పటికప్పుడు తీసుకున్న ఎత్తుగడల ద్వారా మరియు పటిష్టమైన కారకర్తలను అభివృద్ధి చేసుకోవడం ద్వారా ఇది సాధ్యమైందన్నారు. కొందరు స్వార్ధపరులు ఎన్ని అవాంతరాలు సృష్టించినా చైతన్యం గల శాండ్విక్ కార్మికులు వాటిని అధిగమిస్తున్నారన్నారు. 40వ వార్షికోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించుకొని స్వర్ణోత్సవాల వైపుకి ప్రయాణం సాగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. వాలీబాల్ పోటీలలో పాల్గొంటున్న వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాండ్విక్ యూనియన్ నాయకులు పి. పాండురంగా రెడ్డి, ఎమ్.మనోహర్, ఎ. వీరారావు, హెచ్. వెంకట్రావు, వి. సదాశివరెడ్డి, కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా ఘన పూర్ పంప్ హౌస్ పనులు పూర్తి కావాలి

- కెనాల్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి
- యాసంగి పంటకు నీళ్లు చేరాలి
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు

నవతెలంగాణ-నంగునూరు



నవంబర్ నెల చివరి నాటికి నంగునూరు మండలం ఘన పూర్ పంప్ హౌస్ పనులు పూర్తి కావాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అధికారులను ఆదేశించారు. సిద్దిపేట నియోజకవర్గంలోని నంగునూరు మండలం ఘన పూర్ గ్రామం వద్ద నిర్మిస్తున్న ఘన్‌పూర్ పంప్ హౌస్ పనులను మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే యాసంగికి ఎట్టి పరిస్థితిల్లో నీళ్లు అందాలని కోరారు. పదకొండున్నర కిలోమీటర్ల కెనాల్‌కు ఏడున్నర కిలోమీటర్లు పూర్తి అయిందని మిగిలిన నాలుగున్నర కిలోమీటర్లు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.. ఈ పంప్ హౌస్ పూర్తి అయితే ఈ కెనాల్ ద్వారా ఘన పూర్‌లో 4 చెరువులు, అక్కెనపల్లిలో 4 చెరువులు గట్ల మల్యాలలో 5 చెరువులు మొత్తం 13చెరువుల్లో ఈ యాసంగి నీళ్లు నింపాలని అధికారులను కోరారు.. వాటరింగ్ మోటార్స్ బిగించి ఫీడ్ చేసి నీళ్లు పంపింగ్ చేయాలన్నారు. విద్యుత్ పనులు పూర్తి చేయాలని విద్యుత్ అధికారులను, నవంబర్ చివరి నాటికి పంప్ హౌస్ పనులు పూర్తి చేయాలని, వచ్చే యాసంగి పంటకు నీళ్లు అందించాలని ఇరిగేషన్ ఈఈతో కోరారు, పెండింగ్‌లో ఉన్న డిజైన్స్, స్ట్రక్చర్ పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు.. ఈ పంప్‌హౌస్ కెనాల్ పూర్తి అయితే వెయ్యి ఎకరాలకు సాగు నీరు అందుతుందని రైతులకు మేలు జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఎంఆర్ఎఫ్ ఫ్యాక్టరీలో కార్మికుడికి ప్రమాదం

- పనులు చేస్తుండగా టైర్ బిల్డింగ్ మిషన్‌లోకి జారిపోయిన కార్మికుడు
- పరిస్థితి విషమం.. హైదరాబాద్‌కు తరలింపు

నవతెలంగాణ-సదాశివపేట



సంగారెడ్డి జిల్లా సదాశివపేటలోని ఎంఆర్ఎఫ్ టైర్ల ఫ్యాక్టరీలో శనివారం సాయంత్రం జరిగిన ఓ ప్రమాదంలో కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి అతడిని తరలించి వైద్యం అందిస్తున్నారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. మల్లికార్జునగిరి గ్రామానికి చెందిన దుబ్బడం ఆంజనేయులు సదాశివపేటలోని ఎంఆర్ఎఫ్ టైర్ల ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. అయితే విధుల్లో భాగంగా శనివారం రాత్రి 7:30 గంటల సమయంలో టైర్ బిల్డింగ్ మిషన్ పని చేస్తుండగా.. మెకానికల్ లోపం వల్ల ఆ మిషన్‌లోకి జారిపోయాడు. ఈ ప్రమాదంలో అతడి ఎముకలు విరిగిపోగా, ఊపిరితిత్తులకు కూడా బలంగా దెబ్బలు తగిలాయి. కంపెనీ యాజమాన్యం వెంటనే మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రికి అతడిని తరలించారు. ప్రస్తుతం ఆంజనేయులును 48 గంటల పాటు ప్రత్యేక పర్యవేక్షణలో వైద్యులు ఉంచారు. ప్రాథమిక పరీక్షలు పూర్తి చేసినప్పటికీ పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

తండ్రి కొడుకులపై హత్యాయత్నం

నవతెలంగాణ-జోగిపేట



తండ్రి కొడుకులపై కత్తితో ఓ వ్యక్తి దాడి చేశాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు ఇందుకు సం బంధించిన వివరాలను జోగిపేట ఎస్సై పాండు తెలిపారు.

అందోల్ మండలం అల్మాయిపేట గ్రామానికి చెందిన ఆగమయ్య, అతని కొడుకు వెంకట్ పై కోహిర్ మండలం దిగ్వాల్ గ్రామానికి చెందిన సమీప బంధువు నరేష్ కత్తితో దాడి చేసినట్టు ఎస్ఐ చెప్పారు. శనివారం రాత్రి బాధితుల ఇంటికి వచ్చిన నిందితుడు వారితో భోజనం చేసిన తర్వాత అందరూ ఇంట్లో పడుకున్నారు. పథకం ప్రకారం నరేష్ తన బైకు సీటు కింద తెచ్చుకున్న కత్తితో రాత్రి ఒంటిగంట ప్రాంతంలో బయటకు వచ్చి నిద్రిస్తున్న ఆగమయ్యపై దాడి చేశాడు. పక్క రూంలో పడుకున్న తల్లి కొడుకులు శబ్దం విని రావడంతో నిందితుని అడ్డుకున్నారు. ఈ క్రమంలో కొడుకు వెంకట్‌కు కూడా తీవ్ర గాయాలు అయ్యాయి. వారిని వెంటనే ప్రథమ చికిత్స కోసం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, మెరుగైన వైద్య చికిత్సల కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆగమయ్యకు సుమారుగా 35 కుట్లకు పైగా పడ్డట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దాడి ఎందుకు చేశాడు వివరాలు తెలియలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

సినిమాకి వెళ్లి వచ్చేసరికి ఇల్లు గుల్ల

నవతెలంగాణ-పటాన్ చెరు



సినిమాకి వెళ్లి ఇంటికి తిరిగి వచ్చేసరికి దొంగలు ఇల్లు గుల్ల చేసిన సంఘటన బీడీఎల్ భానూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బీడీఎల్ భానూర్ సీఐ స్వామి గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం భానూర్ శివారులో గల లైఫ్ స్టైల్ డ్రీమ్ హెూమ్స్‌లో నందారపు శరత్ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తన కుటుంబంతో కలిసి గత నాలుగు ఏళ్లుగా నివసిస్తున్నాడు. శనివారం రాత్రి 9 గంటల సమయంలో తన కుటుంబంతో కలిసి రామచంద్రాపురంలోని ఏషియన్ మార్ట్‌లో సినిమాకు వెళ్లారు. తిరిగి ఆదివారం తెల్లవారుజామున రెండున్నర గంటల సమయంలో ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. వెంటనే ఇంటిలోకి వెళ్లి చూసేసరికి బీరువాలో ఉన్న 24 తులాల బంగారు ఆభరణాలు, వెండి గ్లాసులు, రూ.ఐదు వేలు నగదు, ఇతర వస్తువులు చోరీకి గురయ్యాయి. వెంటనే బీడీఎల్ పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ స్వామి గౌడ్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. జిల్లా అదనపు ఎస్పీ సంజీరావు సైతం సంఘటన స్థలానికి చేరుకుని దొంగతనం తీరును పరిశీలించారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామని ఆయన తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు సీఐ స్వామి గౌడ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు .

కొనుగోలు కేంద్రంలో డీఆర్‌డీఓ ఆకస్మిక తనిఖీలు



నవతెలంగాణ-హత్నూర

మండల కేంద్రమైన హత్నూరలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఆర్‌డీఓ జ్యోతి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని ఏ రోజుకు ఆరోజు వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. ప్రతీరోజు ట్యాబ్ ఎంట్రీ పూర్తి పుస్తకాలను అప్డేట్‌లో ఉంచాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలకుండా సౌకర్యాలు కల్పించాలని.. ఫస్ట్ ఎయిడ్ బాక్సులు, గోనే సంచులు అందుబాటులో ఉంచాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం జయశ్రీ, ఏపీఎం దేవేందర్, సీసీలు మహేష్, నాగరాణి, వివోఏలు లక్ష్మయ్య, జ్యోతి, ఏఈఓ రమేష్, రైతులు తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-జోగిపేట

ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ డీఆర్‌డీఓ జంగారెడ్డి తెలిపారు. అన్నాసాగర్ గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఐకెపి సిబ్బంది రైతులకు ఇబ్బందులు కలిగించకుండా ధాన్యం సేకరణ చేయాలని సూచించారు. ధాన్యం సేకరణకు కావాల్సిన సదుపాయాలు ఉన్నాయా లేవా అని అడిగి తెలుసుకున్నారు. తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని తక్షణమే తూకం వేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం మాణిక్యం, సీసీ మమత, వీఓఏ లక్ష్మి తదితరులు ఉన్నారు.



నూతన గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-కల్హేర్

మండలంలోని ఖానాపూర్ గ్రామంలో సట్టి హనుమంత్‌రెడ్డి గృహప్రవేశ వేడుక ఆదివారం జరిగింది. ఈ వేడుకలో నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్‌రెడ్డి హాజరై.. పూజా కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కల్హేర్ మండలంలోని కృష్ణాపూర్ గ్రామంలో కీర్తిశేషులు హస్నాపురం గోపాల్ రెడ్డి నిర్మల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని.. శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మండల తాజా మాజీ జెడ్పీటీసీ నరసింహా రెడ్డి, మాజీ సర్పంచ్ గోపాల్ రెడ్డి, నాయకులు నాగిరెడ్డి, దేవేందర్ రెడ్డి, బ్రహ్మం, జిల్లా కో ఆప్షన్ సభ్యులు డాక్టర్ అలీ, మాజీ సర్పంచ్ కిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన శివకుమార్‌కు సన్మానం

నవతెలంగాణ-కల్హేర్

మండలంలోని దేవునిపల్లి గ్రామానికి చెందిన బండి శివకుమార్ ఇటీవలే మూడు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించాడు. బీపీఎం, ఆర్మీ ప్రైమరీ స్కూల్ టీచర్, లైబ్రేరియన్ మరియు ఎస్‌జిటి టీచర్ పోస్టులను సాధించి ఆదర్శంగా నిలిచాడు. అయితే మూడు ఉద్యోగాల్లో టీచర్ పోస్టులో రిక్రూట్ అయిన సందర్భంగా శివకుమార్‌ను అభినందిస్తూ నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహా రెడ్డి భూపాల్ రెడ్డి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖేడ్ తాజా మాజీ జెడ్పీటీసీ రాథోడ్ లక్ష్మీబాయి రవీందర్ నాయక్, కౌన్సిలర్ అభిషేక్ షట్కర్, పట్టణ పార్టీ అధ్యక్షులు నగేష్ సేట్, నాయకులు సాయి యాదవ్, అబ్బు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 17కు అభిషేక్ ఎంపిక



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయిలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్ 17 క్రికెట్ పోటీల్లో అమీన్‌పూర్ మండలంలోని ఐలాపూర్ తాండాకు చెందిన పారిశ్రామికవేత్త శ్రీనునాయక్ కుమారుడు పాతులూత్ అభిషేక్ ఫెడరేషన్ అండర్ 17 గేమ్‌కు సెలెక్ట్ అయ్యాడు. అతడిని సెలక్షన్ కమిటీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, పవన్ చౌహాన్‌లు అభినందనలు తెలిపారు.



కొనుగోలు కేంద్రాల్లో తహసీల్దార్ తనిఖీలు

నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక తహసీల్దార్ బిక్షపతి ఆదివారం ప్రత్యేకంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల స్థితిగతులు పరిశీలించారు. రైతుల అభిప్రాయాలు.. రైతులకు సంబంధించిన సౌకర్యాలు తదితర అంశాలపై ఆరా తీశారు. కాగా ఇటీవల కొత్తగా వచ్చిన మిషన్‌లతో ధాన్యం కొనుగోలు పద్ధతుల వల్ల తీవ్రమైన జాప్యంతో పాటు ఇబ్బందులు ఎదురవుతున్నా యంటూ పలువురు రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఐకెపి ఏపీఎం నరేందర్, పలువురు రైతులు, నిర్వాకులు, అధికారులు పాల్గొన్నారు.



వినియోగదారుల సేవా కేంద్రం ప్రారంభించిన ఎంఈఓ

నవతెలంగాణ-రాయికోడ్

మండల కేంద్రమైన రాయికోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్‌బీఐ ఖాతాదారుల సేవా కేంద్రాన్ని మండల విద్యాధికారి వి.అంజయ్య స్థానిక నాయకులు తుకారాంతో కలిసి ప్రారంభించారు. ఎస్‌బీఐ గ్రామీణ ప్రాంతాల్లో సేవా కేంద్రాలను ఏర్పాటు చేయడం శుభసూచికమని ఎంఈఓ అన్నారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని కేంద్రం నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు జి.గోపాల్, మాజీ సర్పంచ్ నాగార్జున, స్థానికులు సోన్నాయిల రవి, అల్గోల్ రాజు,నర్సింలు, శీను, ఖదీర్, ప్రకాష్ రెడ్డి, జహీర్, లింగం, పెంటయ్య, సాయిరాం తదితరులు ఉన్నారు.



బృందావన్ టీచర్స్ కాలనీలో ఘనంగా కార్తీక మాసోత్సవాలు

నవతెలంగాణ-అమీన్‌పూర్

అమీన్‌పూర్‌లోని బృందావన్ టీచర్స్ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ భక్త హనుమాన్ మందిరంలో ఆలయ కమిటీ అధ్యక్షులు జూలకంటి ప్రభాకర్, కాలనీ అధ్యక్షులు పట్నం సురేందర్ ఆధ్వర్యంలో కార్తీక మాసోత్సవాలను ఘనంగా మొదలయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం నిత్యపూజాలతో ప్రారంభమై ఆలయ కమిటీ అధ్యక్షులు జూల కంటి ప్రభాకర్, వేంకట డి.సత్యనారాయణ దంపతుల చేతుల మీదుగా రాత్రి ఆకాశ దీపం వెలిగించారు. తదనంతరం కాలనీలోని శ్రీ భక్త హనుమాన్ భజన మండలి అధ్యక్షులు మంగళపర్తి వెంకటేశం, కార్యదర్శి కట్లే సిద్దిరాములు ఆధ్వర్యంలో భజన కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భజన మండలి సభ్యులు డి. చంద్రశేఖర్, కూర నాగరాజు, ప్యాట నాగభూషణం, సోమ క్రిష్ణ,బుల్కాపురం క్రిష్ణ గౌడ్, గోనె లింగం, శేరి నాగేశ్వర్ రావ్, మహేందర్ రెడ్డి, సాగర్‌పాటిల్, రఘు పంతులు తదితరులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా... పీల్చేస్తున్నారు..




- సిగరెట్ వ్యసనానికి బానిసవుతున్న యువత
- పేరుకే నో స్మోకింగ్ స్టిక్కర్లు
- జన బహుళ ప్రదేశాల్లో రెచ్చిపోతున్న స్మోకర్లు
- పొగాకుతో శరీర అవయవాలపై పెను ప్రభావం

నవతెలంగాణ-ఝరాసంగం

బోర్ కొట్టినా.. ఖాళీగా ఉన్నా. ఒత్తిడి ఎక్కువగా అనిపించినా పొగాకుతో తయారైన సిగరెట్లు తాగడం ప్రస్తుతం పరిపాటిగా మారింది. అయితే ఇది కేవలం వాళ్లు మాత్రమే తాగకుండా ఇతరులకు అలవాటు చేస్తున్నారు. గ్రామాల్లో ఇది ఒక ఫ్యాషన్‌గా, సిటీలో కల్చర్‌గా, పట్టణాల్లో వ్యసనంగా మారుతోంది. విస్కీ, బీర్ల లాగా ఎక్కువ ఖర్చు దీనికి ఉండదు. కాబట్టి వీటిపై యువత ఎక్కువ ఆసక్తి చూపుతున్నట్టు తెలుస్తోంది. కేవలం రూ.10 నుంచి 20 కే లభిస్తుండటంతో ఖర్చుకు పెద్దగా వెనుకాడటం లేదని స్పష్టంగా అర్థమవుతోంది. కొంతమంది అయితే రోజుకు కొన్ని పెట్టెల సిగరెట్లు కాలుస్తుంటారు. 15 ఏళ్లలోపు పిల్లలు, యువత ఎక్కువగా ధూమపానం చేస్తున్నారు. వీరు చేయడమే కాకుండా పక్కన ఉన్న వారికి ధైర్యం వీటి పొగ వదలడం వల్ల ఇతరులను సైతం పీలుస్తున్న పరిస్థితులు నెలకొంటున్నాయి. దాంతో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఎలా మసలుకోవాలో తెలియక చిన్న పిల్లలు, యువత ఇబ్బందులు పడుతున్నారు.

పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా..

సిగరెట్ వినియోగాన్ని పల్లెలు పట్టణాలు అనే తేడా లేకుండా పొగాకు పొగను పీలుస్తున్నారు. వీరంతా పేదలు, సరైన అక్షర జ్ఞానం లేనివారే. పని ప్రదేశాల్లో ఎక్కువగా వినియోగించడానికి అలవాటు పడుతున్నారు. పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ సరిగా లేక చాలామంది జీవితాలు ఆగం అవుతున్న పరిస్థితి. తల్లిదండ్రుల మాటలు పెడ చెవిన పెడుతూ పిల్లలు ఆగం అవుతున్నారు.నిత్యం సిగరెట్లు, బీడీలు వంటివి తాగుతూ తమ ఆరోగ్యాన్ని ఎంతో మంది పాడు చేసుకుంటున్నారు. లేని సమస్యలను కొని తెచ్చుకంటున్నారు. గ్రామాల్లో పనిపాట లేని వ్యక్తులు, ముఖ్యంగా నడివయస్సు ఉన్న వారు, నిత్యం ఒత్తిడితో కూడిన విధులు చేసేవారు పొగాకుకు ఎక్కువగా అలవాటు చేసుకుంటున్నారు. దీంతో లేని రోగాలను కొని తెచ్చుకోవడమే కాకుండా కన్నవారి ఆశలను ఆశలుగానే మిగిలిస్తున్నారు యువత.



విచ్చలవిడిగా జనబహుళ్య ప్రదేశాల్లో కాలుస్తూ..

సాధారణంగా పొగాకు వినియోగించే వారిలో ఎక్కువ మంది పురుషులే ఉంటున్నారు. నిత్యం అధిక ఒత్తిడితో విధులు నిర్వహించేవారు వీటికి అడిక్ట్ అవుతు న్నారు. ఈ ఒత్తిడి నుంచి కాస్త ఉపశమనం పొందాలనే ఆలోచనతో టీ స్టాల్‌లు, పాండబ్బాల దగ్గర ఓ చేతిలో సిగరెటు అంటించి మరో చేతిలో టీ తాగుతూ కనీసం పక్కన ఎవరైనా ఉన్నారా లేదా అని చూసుకోకుండా ఫ్యాషన్‌గా పొగను ఊదేసున్నారు. దాంతో వారు తాగడమే కాకుండా ఇతరులకు కూడా పరోక్షంగా తాగిస్తున్న పరిస్థితులు నెలకొంటున్నాయి. పొగాకు వినియోగం వల్ల దాదాపు 25 రకాలకు పైగా క్యాన్సర్లు ప్రాణాంతకంగా మారాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా గుండె, ఊపిరితిత్తుల పనితీరుపై దెబ్బ పడుతోంది. ఊపిరితిత్తుల వాపు, రక్తపోటుతో తీవ్ర ఇబ్బందులు ఎదురు కోవాల్సిన పరిస్థితులు లేకపోలేదు. పొగాకు ఉత్పత్తులు తయారు చేసేవారికి,వాటిని మీద ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న ప్రజలకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలి ఆదుకోవాలి. ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో, జన బహుళ ప్రదేశాల్లో పొగాకు వినియోగం నిషేధం అనే వాల్ పోస్టర్లను అతికించి దానివల్ల కలిగే కారకాల గురించి తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజలు, యువత పొగాకు బారిన పడకుండా వాటి వినియోగం తగ్గించేలా కృషి చేయాల్సిన అవసరం,ఆవశ్యకత అటు తల్లిదండ్రులపై, ప్రభుత్వానిపై ఎంతైనా ఉంది.

సిగరెటు పొగా పక్క వారికి కూడా హానికరమే..

సిగరేటు, బీడీల పొగ తాగడం వల్ల ఊపిరితిత్తులు పాడవడంతో పాటు పలు రకాల ఇన్ఫెక్షన్లు ఏర్పడతాయి. ముఖ్యంగా ఊపిరితిత్తులకు వచ్చే డిసీజెస్ సిఒపిడి, ఎంఫైసిమా వంటివి ఎక్కువగా వస్తాయి. ఇవి తాగే వారికే కాకుండా పక్కన ఉండి పీల్చే జనాలకు కూడా పొగ ప్రభావం ఉంటుంది. ఎక్కువగా స్మోక్ చేయడం వల్ల పలు రకాల క్యాన్సర్ వ్యాధి బారిన పడే అవకాశం ఉంది. పీహెచ్‌సిలో ఇప్పటివరకు ఇలాంటి కేసులు నమోదు కాలేదు. పొగాకు దూరంగా ఉండడమే మంచిది.

– డాక్టర్. రమ్య, ఝరాసంగం

ధాన్యం కొనుగోలు కేంద్రంలో కలెక్టర్ తనిఖీలు

- సీరియల్ ప్రకారం రైతుల ధాన్యం తూకం వేయాలని నిర్వాహకులకు సూచనలు

నవతెలంగాణ-కంది

మండల కేంద్రంలోని ఆరుట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రం వద్ద రైతుల రిజిస్టర్‌ను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకురాగానే రైతుల వివరాలు సీరియల్ ప్రకారం రిజిస్టర్ లో నమోదు చేయాలని ఆ ప్రకారమే రైతుల ధాన్యం తూకం వేయాలన్నారు. తాలు తప్పు, చెత్త రాకుండా రైతులు తమ పంటలను కోత కోసే సమయంలో మిషిన్ (రేవల్యూషన్స్ పర్ మినిట్) పద్దెనిమిది కన్నా ఎక్కువగా ఉండేలా సర్దుబాటు చేయాలన్నారు. ధాన్యం తేమ శాతం పదిగేదు లోపు ఉన్నప్పుడే తూకం వేయాలని సూచించారు. అధిక తేమ ఉన్న ధాన్యం నాణ్యత కోల్పోతుందన్నారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని మిల్లులకు తరలించగానే వివరాలను ట్యాబ్‌లలో కొనుగోలు కేంద్రం నిర్వాహకులు నమోదు చేయాలన్నారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసు కున్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్ రెడ్డి, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ కొండలరావు, జిల్లా సహకారశాఖ అధికారి కిరణ్‌కుమార్ తదిరులు పాల్గొన్నారు.



ఆర్టీసీలో అద్దె బస్సుల ఛార్జీలు భారీగా తగ్గింపు



నవతెలంగాణ-జహీరాబాద్

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అద్దె బస్సులు తీసుకునే వారికి శుభవార్త తెలిపిందని.. పెండ్లిళ్లకు, శుభకార్యాలకు, విహారయాత్రలకు ఆర్టీసీ బస్సులను అద్దెకు తీసుకునే వారికి అద్దె ఛార్జీలు భారీగా తగ్గించినట్టు జహీరాబాద్ డిపో మేనేజర్ జాకిర్ హుస్సేన్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ధరలతో పోల్చితే ప్రస్తుతం కిలోమీటర్‌కు పల్లెవెలుగు బస్సుపై రూ.11, ఎక్స్‌ప్రెస్ బస్సు పై రూ.7, డీలక్స్ బస్సు పై రూ.8, సూపర్ లగ్జరీ బస్సు పై రూ.6 మేర ఛార్జీలను తగ్గించినట్టు తెలిపారు. అయ్యప్ప స్వాముల శబరిమల యాత్రకు కూడా అద్దె బస్సులు ఇస్తున్నట్టు చెప్పారు. కాబట్టి ప్రయాణ అవసరాలు, శుభకార్యాలకు, విహార యాత్రలకు ఆర్టీసీ బస్సులను అద్దెకు తీసుకొని క్షేమంగా గమ్య స్థానాలకు చేరాలని కోరారు. ప్రభుత్వ పాంశాలలోని విద్యార్థుల విహారయాత్రల కోసం బసులను బుక్ చేసుకుంటే వారికి 10 శాతం ప్రత్యేక రాయితీ కూడా ఇస్తున్నట్టు చెప్పారు. మరిన్ని వివరాలకు జహీరాబాద్ డిపోలో గానీ లేదా డిపోమేనేజర్ 99592 26269, అసిస్టెంట్ మేనేజర్ 9494093486, బుకింగ్ ఇన్చార్జి 9849889912లను సంప్రదించాలన్నారు.

భేల్‌లో విజిలెన్స్ అవర్నెస్ వారోత్సవాలు

నవతెలంగాణ-రామచంద్రాపురం

రామచంద్రాపురంలోని భేల్ కంపెనీలో విజిలెన్స్ అవేర్నెస్ వారోత్సవాలు నిర్వహించారు. సమగ్రతా సంస్కృతితో దేశ శ్రేయస్సు అనే థీమ్ తో అక్టోబర్ 28 నుండి నవంబర్ 3 వరకు విజిలెన్స్ అవేర్నెస్ వారోత్సవాలను భేల్ అధికారులు నిర్వహించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదిన వారంలో ఈ విజిలెన్స్ వారోత్సవాలను ప్రతి సంవత్సరం నిర్వహిస్తామని భేల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు కె.వి రాజా, శ్రీనివాసరావు తెలిపారు. వారోత్సవాలు సందర్భంగా ప్రజలకు అవగాహన భేల్ టౌన్షిప్, కంపెనీ ప్రాంతాల్లో బ్యానర్లు, ఎస్ఎంఎస్ వంటి వాటితో అందరికీ అవగాహన మరియు చుట్టుపక్కల పాఠశాలలు, కళాశాలలో విద్యార్థులకు వ్యాసంచన, ఉపన్యాసాలు, డ్రాయింగ్, పెయింటింగ్ వంటి పోటీలను సైతం నిర్వహించి అందులో ప్రతిభ చూపిన వారికి బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ జనరల్ మేనేజర్లు, డిఆర్‌ఓలు, హెచ్‌ఓడీలు, అన్ని శాఖల అధికారులు, పాఠశాలల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



బదిలీపై వెళ్లిన ఎంఈఓకి సన్మానం



నవతెలంగాణ-కొండాపూర్

కొండాపూర్ మండల విద్యాధికారిగా పనిచేసి బదిలీపై వెళ్లిన యస్.భీంసింగ్‌కి ప్రస్తుత మండల విద్యాధికారి దశరథ్ అధ్యక్షతన ఆదివారం ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఉద్యోగరీత్యా బదిలీలు సర్వసాధారణమన్నారు. భీంసింగ్ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తూ శాలువాతో సన్మానించారు. అలాగే నూతన మండల విద్యాధికారి దశరథ్‌కు వివిధ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు ఘనంఆ స్వాగతం పలకారు. ఈ కార్యక్రమంలో మండల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎలిజబెత్, యాదగిరి, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు సంజీవ్ రావు, మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్, ఉప తహసీల్దార్ మర్రి ప్రదీప్, టీపీటీఎఫ్ అధ్యక్షప్రధాన కార్య దర్శులు ప్రవీణ్ కుమార్, సంతోష్, పీఆర్టీయూ అధ్యక్ష కార్య దర్శులు జగదీష్, దామోదర్, యూటీఎఫ్ నాయకులు, టీపీటీఎఫ్ రాష్ట్రనాయకులు లక్ష్మయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో నూతన పద్ధతులు వద్దు

నవతెలంగాణ-జిన్నారం

పలు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు నూతన పద్ధతులు పాటించడం ద్వారా అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పాత కొనుగోలు విధానం మాత్రమే పాటించాలని కొందరు రైతులు డిమాండ్ చేస్తున్నారు. నూతన పద్ధతుల ద్వారా కేవలం రోజుకు వేళ్ళ మీద లెక్క గట్ట గలిగినంత మంది రైతుల ధాన్యం మాత్రమే తూకం వేస్తున్నారని చెబుతున్నారు. దాని వల్ల కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరగుతుందని వ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి.. గతంలో లాగా పాత పద్ధతుల ద్వారా మాత్రమే రైతుల నుంచి వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని.. కొనుగోలు చేసిన వాటికి వెంటనే డబ్బులు అందేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రం నిర్వాకులు ఈ విషయాన్ని జిల్లా స్థాయి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించాలని స్థానిక రైతులు గొర్ల శ్రీనివాస్ తదితరులు విజ్ఞప్తి చేశారు.



వ్యాపారస్తులకు సహాయ సహకారాలు అందిస్తా



నవతెలంగాణ-జహీరాబాద్

వ్యాపారస్తులకు ఎల్లవేళలా తమ సహాయ సహకారాలు ఉంటాయని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. అరవింద్ కిరాణా ఏజెన్సీస్ యజమానుల దుకాణ సముదాయాన్ని శనివారం రాత్రి పరిశీలించి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏజెన్సీస్ యజమాని చందు, మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో కేవలం కొన్ని కంపెనీలకు సంబంధించిన ఉత్పత్తులు మాత్రమే ఉండేవని.. వాటిని కొంతమంది మాత్రమే ఏజెన్సీలుగా తీసుకొని సరఫరా చేసేవారన్నారు. ప్రస్తుతం మార్కెట్లో పోటీ పెరగడంతో వివిధ రకాల కంపెనీలు తమ ఉత్పత్తులను ప్రవేశపెట్టడంతో సామాన్య ప్రజలకు ఉపాధి సైతం లభిస్తుందన్నారు. చందు గుప్తా కిరాణా వ్యాపారంతో పాటు మెరీనా కంపెనీకి సంబంధించిన ఉత్పత్తులను ఏజెన్సీ తీసుకొని జహీరాబాద్ నియోజకవర్గంతో పాటు సంగారెడ్డి రంగారెడ్డిక కూడా సరఫరా చేయడం పట్ల అభినందించారు. వ్యాపార రంగంలో నైపుణ్యత ఉంటే ఏ స్థాయికి అయినా ఎదగవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో నామ రవికిరణ్ చందు కుటుంబ సభ్యులు శంకర్, సాయి చరణ్ ,సాయి చేతన్, వెంకట్ సిబ్బంది కలిం, పరశురాం, మాజీ మార్కెట్ చైర్మెన్ గుండప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నైపుణ్యతను పెంపొందించుకోవాలి

- పేరెంట్స్‌తో సత్సంబంధాలు కలిగి ఉండాలి
- కృష్ణవేణి టాలెంట్, మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థల చైర్మెన్ రాజు సంగాని
- ఢిల్లీ బృందంతో ఉపాధ్యాయులకు శిక్షణ

నవతెలంగాణ-పటాన్‌చెరు

ఉపాధ్యాయులు తమ నైపుణ్యతను ఎప్పటికప్పుడు పెంపొందించుకుంటూనే విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయాలని కృష్ణవేణి టాలెంట్, మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థల చైర్మెన్ రాజు సంగాని అన్నారు. పట్టణంలోని జీహెచ్ఎంసి మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో ఆ సంస్థ ఇంచార్జ్ డైరెక్టర్ అచ్చే నాగరాజు ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కృష్ణవేణి టాలెంట్, మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థల సమ్మేటివ్ 1 అనాలసిస్ మరియు ఉపాధ్యాయుల శిక్షణ ప్రారంభోత్సవంలో రాజు సంగాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు నైపుణ్యత కలిగిన ఢిల్లీ బృందంతో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వటం జరిగింది. అనంతరం జరిగిన సమావేశంలో రాజు మాట్లాడుతూ.. ముఖ్యంగా విద్యార్థుల సంఖ్య పెరిగేలా అడ్మిషన్స్ ఎలాచేయాలి, పేరెంట్స్‌తో ఎలా మాట్లాడాలి, ఉపాధ్యాయుల మధ్య సంబంధాలు, గూగుల్, యూట్యూబ్, మరియు ఫేస్ బుక్‌లో రేటింగ్స్ ఎలా ఉన్నాయి...పాఠశాలలో ఏఏ ఆక్టివిటీస్ చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజు సంగాని మాట్లాడుతూ.. విద్యార్థుల నైపుణ్యతను క్షుణ్ణంగా పరిశీలించి వారిలో నిమిడి ఉన్న జ్ఞానాన్ని వెలికి తీసి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆ సంస్థ జోనల్ ఇన్చార్జి బుచ్చిరెడ్డి, ఎండి కాజా హుస్సేన్, అకాడమీ డైరెక్టర్ మురళి, శంకర్ పల్లి, భానూర్, పటాన్ చెరు, నారాయణ ఖేడ్, షాద్ నగర్ బ్రాంచ్ లతోపాటు బ్రాంచీల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్‌ను పొదుపుగా వాడాలి



నవతెలంగాణ-జోగిపేట

వినియోగదారులు విద్యుత్‌ను పొదుపుగా వాడాలని జోగిపేట విద్యుత్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. స్థానిక అన్నాసాగర్ సబ్‌స్టేషన్ ఆవరణలో విద్యుత్ వినియోదారుల అవగాహన సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినియోగ దారులు విద్యుత్ విషయంలో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయా గ్రామాల్లో రైతులు, వినియోదారులు తమ సిబ్బంది ఫోన్ నెంబర్లు పెట్టుకొని సమస్యలు వచ్చినప్పుడు వారికి సమాచారం అందించి సమస్య పరిష్కారం అయ్యేందుకు సహకరించాలన్నారు. గృహజ్యోతి కింద అర్హులైన వారికి ఉచిత విద్యుత్ సరఫరా అందిస్తున్నామన్నారు. అర్హులు ఈ పథకం వర్తించని వారు ఉంటే కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. కరెంటు బిల్లులు కూడా సకాలంలో చెల్లించి డిపార్ట్మెంట్కు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో చౌటకూరు ఏఈ రాఘవ, సిబ్బంది మల్లేశం, వినియోదారులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-హత్నూర

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2000-2001 బ్యాచ్‌కి చెందిన పదో తరగతి విద్యార్థులు పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. నాడు తమకు బోధించిన ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించి.. మెమంటోలు అందజేశారు. బాల్యం ఎంతో సంతోషకరంగా ఉండేదని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని మంచి చెడులను తెలుసుకున్నారు. పాఠశాల స్థాయిలో చేసిన చిలిపి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. అనేక సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులను ఒకే వేదికపై కలుసుకోవడం చాలా సంతోషకరమన్నారు. ఇప్పటికీ ఉపాధ్యాయులను గుర్తుంచుకొని పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి ఆహ్వానించిన ప్రతి ఒక్క విద్యార్థులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం అందరు కలిసి వన భోజనాలు చేశారు.



మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రానికి చెందిన మేదరి భాగ్యమ్మ ఇటీవలే మృతి చెందింది. ఈ విషయం తెల్సుకున్న మాజీ ఎంపీపీ దమ్మగౌని రవీందర్ గౌడ్ ఆదివారం రోజున మృతురాలి కుటుంబానికి రూ.5000ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జిన్నారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శంకరయ్య, మాజీ ఎంపీటీసీ పుట్టి భాస్కర్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు యనగండ్ల నరేందర్ గౌడ్, సోషల్ మీడియా మండల ఇంచార్జ్ విష్ణుమూర్తి, నాయకులు వెంకటేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
మెదక్
సోమవారం | 04 నవంబర్ 2024 | www.navatelangana.com

నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న దుబ్బాక ఎమ్మెల్యే.

నవతెలంగాణ-తొగుట



మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యూత్ లీడర్ పిట్ల వెంకటేష్ ఆదివారం నూతన గృహప్రవేశ కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భం గా వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలి పారు. ఆయన వెంట మాజీ ఎంపిటిసి వేల్పుల స్వామి, గ్రామ పార్టీ అధ్యక్షులు పులిగారి శివయ్య, తగరం అశోక్, బండారు స్వామి గౌడ్, పిట్ల వెంకట య్య, పాత్కుల బాలేష్, ఈదుగల్ల పర్శరాములు, తడ్గం నర్సింహారెడ్డి, ఎంగలి నరేందర్, అజాం, బెజ్జ నమైన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫామ్ హౌస్ లో పేకాట ఆటగాళ్ల పోలీసుల పట్టివేత

తూప్రాన్ సిఐ రంగక్రిష్ణ

నవతెలంగాణ-తూప్రాన్

మెదక్ జిల్లాలోని శివ్వంపేట మండలం శభాష్ పల్లి గ్రామ శివారులో హనుమంత రెడ్డికి చెందిన ఫామ్ హౌస్‌లో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తూప్రాన్ సిఐ రంగకృష్ణ విలేకరుల సమావేశంలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేకాట ఆడుతున్న ఏడుగురిని పట్టుకొని వారి వద్ద నుండి ఒక 1,07,500 రు/లు, 3 కార్లు, 8 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి రిమాడ్‌కు తరలించినట్లు సిఐ రంగకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఎస్ఐ శివానందం,పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతుకు.. కష్టాల తంట

- గ్రామాల్లో పత్తి ఏరడానికి కూలీల కొరత
- కూలీలు దొరక్క తంటాలు పడుతున్న రైతులు
- స్థానికంగా దొరకని తీరు..
- అధికమవుతున్న ఖర్చులు
- కనీస మద్దతు ధర రూ.10వేలకు పెంచాలని డిమాండ్





నవతెలంగాణ-కొల్చారం

ఈసారి పత్తి పంట సాగు చేసిన రైతులకు కష్టాలు తప్పడం లేదు. పంటకు తెగుళ్ళు, పెరిగిన పెట్టుబడి ఖర్చులు, వాతావరణ పరిస్థితులు ఇలా అనేక ఒడిదుడుకులతో పత్తి పంటను సాగు చేస్తే ఆశించిన దిగుబడులు రావడం లేదని రైతులు ఆందోళనలు చెబుతున్నారు. ధరలు తగ్గుముఖం పడతుండడంతో వీలైనంత త్వరగా పత్తిని సేకరించి అమ్ముకోవాలని అనుకుంటున్నా. కూలీల కొరతతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటూ పంటను తీయిస్తున్నారు. మెదక్ జిల్లా కొల్చారం మండలంలో 21 గ్రామ పంచాయతీలు ఉండగా రంగంపేట, పైతర, తుక్కాపూర్, కోనాపూర్, మాదాపూర్, ఎనగండ్ల, గుంపలకుంట గ్రామాల్లో పత్తికి అనుకూలమైన నల్లరేగడి భూములు ఉండడంతో ఈసారి రైతులు ప్రధానపంటగా పత్తిని సాగు చేశారు. మొత్తం మండల వ్యాప్తంగా 1275 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. వర్షాలు ఆశించిన స్థాయిలో కురవడంతో జూన్ మొదటి, రెండో వారంలోనే విత్తనాలు విత్తారు. ఏపుగా పెరిగిన మొక్కలు, కాయలు కాసే సమయంలో తుఫాన్ కారణంగా పంటలు దెబ్బతిన్నాయి. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్న ఉద్దేశ్యంతో నాణ్యమైన పత్తికి కేంద్ర ప్రభుత్వం క్వింటాలుకు రూ.7521 మద్దతు ధర ప్రకటించింది. తేమశాతం 9 ఉన్నట్లైతే రూ.7446, 10శాతం కు రూ.7371, 12శాతం కు రూ.7220 చెల్లిస్తున్నారు. కానీ ఇప్పటి వరకు సీసీఐ కేంద్రాలు ప్రారంభించక పోవడంతో చేతిలో చిల్లిగవ్వ లేక కొందరు రైతులు చేసేదేమీ లేక ప్రైవేటులో విక్రయిస్తున్నారు. మొదట క్వింటాల్ పత్తి రూ.7వేల పైచిలుకు ఉన్న ధర క్రమంగా తగ్గుతూ రూ.6వేల 500 లకు చేరింది. తగ్గుముఖం పడుతున్న ధరలతో ఎలాగైనా పత్తిని త్వరగా సేకరించి అమ్ముకోవాలని రైతులు భావిస్తున్నారు.

రైతులకు నష్టమే..

ఎకరానికి రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకు పెట్టుబడి పెట్టి రైతులు పత్తి పండించారు. తుఫాను కారణంగా పత్తి దిగుబడి తగ్గిపోయింది. ఈ పరిణామాలతో ప్రైవేట్ వ్యాపారులు ధరను తగ్గించేశారు. దీంతో రైతులకు క్వింటాలు రూ.2 వేల నుంచి రూ.3 వేల నష్టం కలుగుతోంది. పెట్టిన పెట్టుబడులు రాక దిక్కుతోచని స్థితిలో కూరుకుపోవాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళనలు చెందుతున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు కష్టాలను అర్థం చేసుకొని పత్తి పంటకు కనీస మద్దతు ధర పెంచి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

కూలీలకు పెరిగిన డిమాండ్

అందరి పత్తి ఒకేసారి ఏరడానికి రాగా కూలీలకు డిమాండ్ ఏర్పడింది. కిలో పత్తి తీయాలంటే మొదటి పత్తికి కిలోకు రూ.10నుంచి రూ.12వరకు చెల్లిస్తున్నారు. రెండో పత్తికి రూ.15పైనే చెల్లించాల్సి వస్తోందని రైతులు పేర్కొంటున్నారు. కొందరు పక్కగ్రామాల నుంచి రాకపోకలు సాగిస్తుండడంతో ఆటో చార్జీలు అదనంగా రూ.500 ఖర్చుతో చేస్తున్నారు.

స్థానిక కూలీలు చాలట్లేదు..



అందరి చేనుల్లో పత్తి ఒకేసారి ఏరడానికి రావడంతో స్థానిక కూలీలు సరిపోవడం లేదు. దీంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి కూలీలను రప్పిస్తున్నాం. ప్రయాణ ఖర్చులు భరిస్తున్నాం. కూలీలు దొరక్క పోవడంతో రెండురోజుల్లో పూర్తయ్యే చేను వారం రోజుల పైనే పడుతోంది.

అనూష రైతు, పైతర

మద్దతు ధర రూ.10వేలకు పెంచాలి



ఈ ఏడాది పత్తి ఏరడానికి ఇతర గ్రామాల నుంచి కూలీలను తీసుకువస్తున్నాం. స్థానికంగా కూలీల కొరత తీవ్రంగా ఉంది. కిలో పత్తి ఏరేందుకు రూ.10నుంచి 12చెల్లిస్తున్నాం. దీంతో పెట్టుబడులు అధికమవుతున్నాయి. ప్రభుత్వం 10వేలు మద్దతు ధర ప్రకటించాలి.

పుట్టి లక్ష్మీ రైతు, పైతర

దళారులను నమ్మి మోసపోవద్దు..



పత్తి పంట పండించిన రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సిసిఐ కొనుగోలు కేంద్రాల వద్దనే సరైన మద్దతు ధరకు పత్తిని విక్రయించుకోవాలని కోరుతున్నాం.

స్వేతాకుమారి, వ్యవసాయాధికారి కొల్చారం

పత్తి రైతుల్లో గుబులు..!

- రెండు రోజులుగా కారుమబ్బులు
- వర్షం పడితే పగిలిన పత్తికి నష్టం
- ఆందోళనలో రైతులు



నవతెలంగాణ-పెద్దశంకరంపేట

గత మూడు సంవత్సరాలుగా పత్తి రైతులు ఏదో రకంగా నష్టపోతూనే ఉన్నారు. రెండు సంవత్సరాలుగా వరదల వల్ల పత్తి నీట మునిగి వేల ఎకరాల్లో నష్టపోయిన విషయం తెలిసిందే. ఈ ఏడాది కూడా మెదక్ జిల్లాలో సెప్టెంబర్ నెల ఆఖరి వరకు వర్షాలు కురవడంతో ఆయా మండలాల్లో పత్తి పంటకు నష్టవాటిల్లింది. ప్రస్తుతం పత్తితీత పనులు ముమ్మరంగా కొనసాగుతున్న క్రమంలో రెండు రోజులుగా కారు మబ్బులు కమ్ముకొస్తున్నందున రైతులు ఆందోళన చెందుతున్నారు.

21 వేల ఎకరాల్లో సాగు..

మండల వ్యాప్తంగా సుమారు 21 వేల ఎకరాల్లో ప త్తి సాగు చేస్తున్నారు. ఖరీఫ్ ఆరంభ సమయంలో వర్షాలు మందకొడిగా కురిసిన్నా.. తరువాత వర్షా లు అనుకూలించడంతో పత్తి ఏపుగా పెరిగింది. పూత కాత దశలో వర్షాలు జాడ లేక పోవడంతో దిగుబడి తగ్గే అవకాశాలు ఉన్నాయి. ఎకరానికి 10 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా ఈ ఏడాది ఎకరానికి 6 నుంచి 7 క్వింటాళ్ల వరకు మాత్రమే వచ్చే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. పూత కాత దశలో వర్షాలు లేక పోవడమే ఇందుకు కారణం.

మబ్బులతో రైతుల్లో ఆందోళన

గత రెండు రోజుల నుంచి కారు మబ్బులు వస్తున్నందున వర్షం కురిస్తే పత్తికి నష్టం వాటిల్లు తుందని రైతులు వాపోతున్నారు. ప్రైవేటు వ్యాపారులు క్వింటాలు పత్తికి రూ.6500, నుంచి రూ.7,000 మాత్రమే చెల్లిస్తున్నారని వాపోతున్నారు. దీంతో రైతులు మరింత నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం బూర్గుపల్లి, మండల పరిధిలో మోస్తారు వర్షం కురిసింది. వర్షానికి పగిలిన పత్తి తడిస్తే గిట్టుబాటు ధర రాదని రైతులు వాపోతున్నారు.

కూలీల కొరత..

మండల వ్యాప్తంగా పత్తితీత పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మండలంలో కూలీల కొరత కారణంగా మండలంలో ఆయా గ్రామాల నుంచి కూలీలను రప్పిస్తున్నారు. పత్తి తీసేందుకు కిలోకు రూ. 10 లు చెల్లించాల్సి వస్తుందని, అదేవిధంగా ఆటో చార్జీలు సైతం చెల్లించాల్సి వస్తుందని వాపోతున్నారు. పెట్టుబడులే అధికంగా పెరిగిపోతున్నాయని రైతుకు మిగిలేదు ఏమి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్వింటాలుకు రూ.10 వేలు చెల్లిస్తేనే రైతులకు మేలు జరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి గిట్టుబాటు ధర పెంచి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

నిజాంపేటలో సర్పంచ్ పోటీలో ఆశావాలు అధికం

- ఒకరిని మించి ఒకరు సామాజిక సేవా కార్యక్రమాలు
- యువత కూడా ఈసారి గట్టి పోటీ ఇచ్చే అవకాశాలు

నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలో సర్పంచ్‌గా పోటీ చేయడానికి అనేకమంది పోటీ చేయడానికి ముందుకు వస్తున్నారు. ఒకరిని మించి ఒకరు సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. మాజీ సర్పంచ్ అనూష లక్ష్మీనరసింలు పోటీ చేయడానికి సుముఖంగా ఉన్నట్లు ప్రచారం. గతంలో ఏ సర్పంచులు చేయలేనన్ని అభివృద్ధి పనులు చేశానని మరోసారి అవకాశం కల్పించినట్లయితే ఇంకా ఎంతో అభివృద్ధి చేస్తానంటున్నారు. పంజా మహేందర్ సర్పంచ్ బరిలో ఉండడానికి సుముఖత వ్యక్తం చేశారు. గత పది సంవత్సరాల నుంచి అనేక సేవా కార్యక్రమాలలో పాల్గొన్నానని ప్రాథమిక పాఠశాలను దత్తత తీసుకొని ఇంగ్లీష్ మీడియం టీచర్లను పెట్టి విద్యార్థులకు మంచి విద్యను అందించానని తెలిపారు. గ్రామంలోని ప్రతి కుల సంఘాలకు గణేష్ విగ్రహాలకు చందాలు ఇచ్చానని యువత పూర్తిగా తన వైపే ఉన్నదంటున్నారు. చల్మేటి నరేందర్ కూడా సర్పంచ్‌గా పోటీ చేస్తాడని మండల కేంద్రంలో జోరుగా ప్రచారం జరుగుతుంది. గ్రామంలో అనేక సామాజిక కార్యక్రమాలకు ఆర్థిక సహాయం కూడా చేశానని బీడీ కార్మికుల మద్దతు పూర్తిగా నాకే ఉందని గతంలో సర్పంచ్‌గా పోటీ చేసి ఓడిపోవడం జరిగిందని, సానుభూతి తనకే ఉందంటున్నారు. తన విజయాన్ని ఎవరు ఆపలేరని గట్టి ధీమాతో ఉన్నారు. పప్పుల కిష్టారెడ్డి గతంలో నీటి సంఘాల చైర్మన్గా పీఏసీఎస్ చైర్మెన్‌గా పనిచేశానని రైతులు తన వెంటే ఉన్నారన్నారు. తన సతీమణి ఎంపీటీసీగా పనిచేశారని మహిళలు తనకే ఓట్లు వేస్తారనే ధీమాతో ఉన్నారు. వెల్దుర్తి వెంకటేష్ గౌడ్ సర్పంచ్ బరిలో ఉంటానని కాంగ్రెస్ పెద్దల అండదండలు పూర్తిగా తనకే ఉన్నాయని, యువత మద్దతు తనకే ఉందనే ధీమాతో ఉన్నారు. పంజా బాబు ముదిరాజ్ సంఘం అధ్యక్షులు సర్పంచ్‌గా పోటీ చేసి గెలిచి గ్రామాభివృద్ధికి పాటుపడతానని గ్రామంలో 300 ముదిరాజ్ కుటుంబాలు నివసిస్తున్నాయని, వీరందరూ కలిసి తనను గెలిపించుకుంటారని, తన విజయం నల్లేరు మీద నడకేనన్నారు. టాక్టర్ల యూనియన్ పూర్తిగా తనకే మద్దతిస్తుందనే ధీమాతో ఉన్నారు. వెల్దుర్తి శ్రీకాంత్ గౌడ్ కూడా సర్పంచ్‌గా పోటీ చేయనున్నారని యువత గుసగుసలాడుకుంటున్నారు. గతంలో సర్పంచ్‌గా పోటీ చేసి ఓడిపోయానని అప్పటి సానుభూతి ఇప్పటికీ ప్రజలలో ఉన్నదని,



గ్రామస్తులందరికీ అన్ని రంగాల వారికి అనేక సేవలందించానన్నారు. తనను గెలిపించినట్లయితే మండల కేంద్రాన్ని ఒక రోల్ మాడల్‌గా తీర్చిదిద్దుతానన్నారు. ఏదిఏమైనప్పటికీ నిజాంపేట గ్రామ సర్పంచ్ ఎన్నికలు ఈసారి చాలా రసవత్తరంగా జరిగే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయని పలువురు పేర్కొంటున్నారు.

భూపోరాటాల్లో ముందున్న తండ్రి కొడుకులు

- సీపీఐ(ఎం) ఉద్యమాల్లో కొడుకు ప్రవీణ్, తండ్రి మల్లేశం

నవతెలంగాణ-తూప్రాన్



సీపీఐఎం ఆధ్వర్యంలో చేసే భూ పోరాట ఉద్యమాల్లో తండ్రి మల్లేశం, కొడుకు ప్రవీణ్‌లు నిరంతరం కృషి చేస్తున్నారు. చేగుంట మండలం చిట్టోజి పల్లి గ్రామానికి చెందిన మల్లేశం, కొడుకు ప్రవీణ్‌లు జిల్లావ్యాప్తంగా భూనిర్వాసితుల కోసం, అన్యాక్రాంతమైన భూ సమస్యలపై నిర్విరామ పోరాటం చేస్తూ ప్రజల పక్షాన నిలుస్తున్నారు. కుమారుడు కే ప్రవీణ్ గత నాలుగు సంవత్సరాలుగా విద్యార్థి ఉద్యమాల్లో పనిచేస్తూ సిపిఐఎంలో పూర్తి కాలం కార్యకర్తగా పనిచేస్తున్నారు. ముఖ్యంగా కరోనా కాలంలో మెదక్‌లోని కేవలం కిషన్ భవన్లో ఏర్పాటుచేసిన కరోనా పేషెంట్లకు క్వారంటేన్ కేంద్రాల్లో రోగులకు సేవలందించారు. పంది మల్లేశం చిత్తోజు పల్లి గ్రామంలో 10 సంవత్సరాలుగా భూ పోరాటాల ద్వారా సీపీఐఎం పార్టీలో చేరి కార్యకర్తగా పనిచేస్తున్నారు. తన కొడుకు చేసే ప్రజా ఉద్యమాలకు తండ్రి కూడా మద్దతిస్తున్నారు. ఒకే కుటుంబంలోని తండ్రి కొడుకులు ప్రజా ఉద్యమాల్లో పాల్గొనడం పట్ల సీపీఐ(ఎం) ప్రతినిధులు అభినందించారు.

పారిశ్రామిక కార్మికుల పక్షాన నిరంతర పోరాటం చేస్తున్న మహేందర్ రెడ్డి

- సీఐటియు ఉద్యమాలకు ఆకర్షణతో సిపిఐ(ఎం) లో చేరిక
- కార్మికుల హక్కుల కోసం నిర్విరామ పోరాటం
- సిఐటియు మెదక్ జిల్లా అధ్యక్షులు ఏ.మహేందర్ రెడ్డి

నవతెలంగాణ-తూప్రాన్

మెదక్ జిల్లాలోని శివ్వంపేట మండలం చండి గ్రామానికి చెందిన అంతిరెడ్డిగారి మహేందర్ రెడ్డి సిఐటియు జిల్లా అధ్యక్షునిగా పారిశ్రామిక పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికుల కోసం నిరంతరం ఉద్యమిస్తున్నారు. గతంలో మండలంలోని శభాష్ పల్లి గ్రామంలో ఉన్న సుగుణ పరిశ్రమలో అంతిరెడ్డిగారి మహేందర్ రెడ్డి కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్న సమయంలో సిఐటియు యూనియన్ ఆధ్వర్యంలో కార్మికుల పక్షాన కనీస వేతనాల కోసం పోరాటాలకు ఆకర్షితులయ్యారు. 2014 సంవత్సరంలో సిపిఐ (ఎం)పార్టీ కార్యకర్తగా వచ్చి పూర్తి కాలం కార్యకర్తగా మారిపోయారు. శివ్వంపేట మండలంలో నూతన పార్టీ సభ్యులను నిర్మించుకుంటూ, భూపోరాటాలు, కనీస వేతనాల కోసం పోరాటాలను నిర్వహిస్తూ, జిల్లా కమిటీ సభ్యుడిగా ఎన్నికై, శివ్వంపేట మండలంలో అన్ని గ్రామాలలో పార్టీ విస్తరణ కోసం కృషి చేస్తున్నారు. సీఐటీయూ రంగంలో విస్తరణ కోసం అనేక పోరాటాలు నిర్వహించారు. శివ్వంపేట మొదలైన పోరాటాలతో పాటు తూప్రాన్, మనోహరాబాద్‌లలో సిఐటియూ విస్తరణకు కృషి చేశారు. సాగర్ ఏసియా కంపెనీలో పోరాటం యజమాన్యం ఒత్తిళ్లకు తలొగ్గి నాన్ బెయిలబుల్



వారంట్ జారీ చేయడం జరిగింది.అయినా పోరాటాలు ఆపకుండా కార్మికుల సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించి కనీస వేతనాలు, ప్రమాదాలు జరిగినప్పుడు నష్టపరిహారం ఇప్పించారు. ఇప్పటికీ శివ్వంపేట మండలంలో పార్ట్ గా అన్ని గ్రామాలలో గుర్తింపు ఉందని అదేవిధంగా తూప్రాన్, మనోహరాబాద్ మండలలో సిఐటియుగా మంచి గుర్తింపు తీసుకొచ్చారు. ఉమ్మడి జిల్లాలో మండల కమిటీ ప్రస్థానం మొదలై డివిజన్ కమిటీ ,జిల్లా కమిటీ సభ్యుడిగా,2022 కార్యదర్శ వర్గ సభ్యునిగా ఎన్నికై, రెండవసారి 2024 -15 వ జిల్లా మహాసభలలో రెండవ సారి ఎన్నిక కావడం పట్ల రైతులు ,వ్యవసాయకార్మికులు, కార్మికులు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. రాబోయే కాలంలో ప్రజా ప్రజా సమస్యలే ఎజెండాగా తీసుకొని, సిఐటియు విస్తరణ కోసం కృషి చేస్తానన్నారు.

పారిశ్రామిక కార్మికుల హక్కులను కాపాడాలి

- స్థానికులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలి
- పరిశ్రమల కార్మికుల హక్కుల కోసం కార్మిక చట్టాలను అమలు చేయాలి
- జయరాజ్ సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కార్యదర్శి

నవతెలంగాణ-తూప్రాన్



ఉమ్మడి మెదక్ జిల్లాలో పారిశ్రామిక ప్రాంతాలలోని పరిశ్రమ కార్మికుల హక్కుల కోసం ఏర్పడిన కార్మిక చట్టాలను అమలు చేయాలని సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జయరాజ్ డిమాండ్ చేశారు. తూప్రాన్ లో నిర్వహించిన సీపీఐ(ఎం) 15వ జిల్లా మహాసభలకు ఆయన హాజరై ప్రసంగించారు. ఇతర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో పరిశ్రమలలో ఉపాధి నిమిత్తం అనేక సంఖ్యలో కార్మికులు వారి కుటుంబ సభ్యులు వలస వస్తున్నారని, అటువంటి కార్మికుల కోసం కార్మిక శాఖ ద్వారా పలు రకాల సౌకర్యాలను కల్పిస్తూ, కార్మికులకు భద్రత కల్పించాలని కోరారు. ఉమ్మడి జిల్లాలోని అధిక పరిశ్రమలు ఉన్న ప్రాంతాలలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సూచించారు. స్థానికంగా డిమాండ్ ఉన్న ప్రాంతాలలో ఉద్యోగ అవకాశాలు సృష్టించాలన్నారు. కార్మికుల సంక్షేమానికి,వారి ప్రయోజనాల కోసం సిపిఐ(ఎం) ఎర్రజెండా నిర్విరామంగా కృషి చేస్తుందన్నారు.

కార్మికుల కోసం అక్కాతమ్ముడి ఉద్యమ పోరాటాలు

- కడారి నర్సమ్మ, కడారి నాగరాజు ఉద్యమ పయనం
- అక్కా, తమ్ముళ్ల ఉద్యమ పోరాటాల ఫలితమే సిపిఐఎం జిల్లా కమిటీలో చోటు

నవతెలంగాణ-తూప్రాన్

మెదక్ జిల్లా నర్సాపూర్ మండలంలోని పెద్దచింతకుంట గ్రామానికి చెందిన కడారి నర్సమ్మ, కడారి నాగరాజులు అను అక్కా, తమ్ముల్లు. ఇద్దరు సిపిఐ(ఎం) కార్మిక ఉద్యమ పోరాటాల్లో పాల్గొంటున్నారు. ప్రత్యక్షంగా పరోక్షంగా కర్షకుల కోసం కార్మికుల కోసం నిర్విరామ ఉద్యమం చేస్తుంటారు. కడారి నర్సమ్మ 1996లో అంగన్వాడి టీచర్ ఉద్యోగం చేస్తుండగానే సీఐటీయూ పోరాటాలకు ఆకర్షితులై అనేక కార్మికుల పోరాటాల్లో ప్రత్యక్ష ఉద్యమాల్లో పాల్గొన్నారు. కమ్యూనిస్టు పార్టీ ఉద్యమాలకు ఆకర్షితురాలై 2011లో అంగన్వాడి ఉద్యోగానికి రాజీనామా చేసి, సిపిఐ(ఎం) పార్టీ పూర్తి కాలం కార్యకర్తగా పనిచేస్తున్నారు. ఆ తర్వాత ఉమ్మడి జిల్లా కమిటీలో సిపిఐ(ఎం)



జిల్లా కార్యవర్గ సభ్యురాలుగా ఎన్నికయ్యారు. ప్రత్యేక జిల్లాలు ఏర్పడిన అనంతరం మెదక్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలుగా ఎన్నికై, కార్మిక ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. మెదక్ జిల్లాలోని తూప్రాన్ మండలంలో నవంబర్ 2, 3 తేదీలలో నిర్వహించిన సీపీఐ(ఎం) 15వ జిల్లా మహాసభల్లో జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఒక మహిళగా అనేక ఉద్యమాల్లో పాల్గొంటూ, తన జీవితాన్ని ప్రజలకు అంకితం చేశారు. తాను పనిచేయడమే కాకుండా తన కుటుంబంలోని సొంత తమ్ముడు నాగరాజును కూడా ప్రజా ఉద్యమాల వైపు మళ్ళించారు. కడారి నాగరాజు విద్యార్థి దశ నుండే సీఐటీయూ ఉద్యమాలకు కార్యవర్గ సభ్యులుగా పని చేస్తూ, ఇతర కార్మిక సంఘాల ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొంటూ, ఉద్యమ పయనాన్ని కొనసాగిస్తున్నారు. జిల్లా ప్రత్యేకంగా ఏర్పడినప్పటి నుంచి పార్టీ జిల్లా కమిటీ సభ్యుడిగా నేటి వరకు కొనసాగుతున్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అక్క తమ్ముడులు ప్రజా ఉద్యమాల్లో పాల్గొంటూ జిల్లా ప్రజలకు ఆదర్శవంతంగా నిలుస్తూ తన జీవితాలను ప్రజలకు అంకితం చేశారు.

ప్రజా ఉద్యమాల్లో శన్మాపూర్‌కు చెందిన అన్నదమ్ములు

- సిపిఐ (ఎం) జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన కోరెంకల మల్లేశం, కోరెంకల కొమురయ్యలు

నవతెలంగాణ-తూప్రాన్



మెదక్ జిల్లాలోని హవేలీ ఘనపూర్ మండలానికి చెందిన శమ్నాపూర్ గ్రామానికి చెందిన కోరెంకల మల్లేశం, కోరెంకల కొమురయ్యలు ఇద్దరు అన్నదమ్ములు సిపిఐ(ఎం) పార్టీ చేసే ప్రజా ఉద్యమాల్లో పాల్గొంటున్నారు. శమ్నాపూర్ గ్రామానికి చెందిన గత పది సంవత్సరాలుగా సిపిఐ(ఎం) చేసే ఉద్యమాల్లో పనిచేస్తూ, పూర్తి కాలం కార్యకర్తగా కొనసాగుతున్నారు.. ప్రత్యేక జిల్లా ఏర్పడిన తర్వాత సిపిఐ (ఎం) జిల్లా కార్యవర్గ సభ్యునిగా గత 6 సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. తమ్ముడు కొమురయ్య మెదక్ జిల్లా సిపిఐ (ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా ఎన్నుకోబడినారు. మహాసభలో రెండవ రోజులో భాగంగా సిపిఐ (ఎం) జిల్లా కార్యవర్గంలో కార్యదర్శివర్గ సభ్యునిగా ఎన్నికైన తన తమ్ముడు కొమరయ్య సిపిఐ (ఎం) పార్టీ వైపు పనిచేయడం కోసం సిద్ధంగా ఉంటారని తెలిపారు. శమ్నాపూర్ గ్రామం, మండలంలో అనేక ప్రజాసేవా కార్యక్రమాల్లో, కార్మిక ఉద్యమాలలో నిరంతరం పాల్గొంటారు. తమ్ముడిని ప్రోత్సహించడం ద్వారా తూప్రాన్‌లో 2 రోజులు నిర్వహించిన 15వ జిల్లా మహాసభలలో సిపిఐ (ఎం) మహాసభల్లో ఇద్దరు అన్నదమ్ములు ప్రతినిధులుగా హాజరయ్యారు.

కమ్యూనిస్టు పార్టీ ఉద్యమాలకు అంకితమైన భార్యభర్తలు

- 30 సంవత్సరాలుగా సిపిఐ(ఎం)పార్టీ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాల్లో ఏ.మల్లేశం
- అంగన్వాడీ టీచర్ ఉద్యోగానికి రాజీనామా చేసిన భార్య కమల
- ప్రజా సమస్యలపై నిర్విరామ పోరాటం చేస్తున్న భార్యాభర్తలు

నవతెలంగాణ-తూప్రాన్

ఉమ్మడి మెదక్ జిల్లాలోని హత్నూర మండలం కాసాల గ్రామానికి చెందిన భార్యాభర్తలు అజ్జమర్రి మల్లేశం, అజ్జమర్రి కమలలు మెదక్ పట్టణంలోనే నివసిస్తూ,సిపిఐ(ఎం) పార్టీ చేస్తున్న ఉద్యమాలలో 30 సంవత్సరాలుగా పూర్తి కాలం కార్యకర్తగా, కార్యదర్శిగా వివిధ హోదాల్లో సేవలందిస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఒకసారి సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శిగా ప్రత్యేక మెదక్ జిల్లాలో 2 సార్లు సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. సిపిఐ(ఎం) ట్రేడ్ యూనియన్ రైతు సమస్యలపై వ్యవసాయ సమస్యలపై భూ నిర్వాసితుల సమస్యలపై పోరాటాలు చేస్తూ ప్రజా సంక్షేమం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చుటకు పనిచేస్తున్నారు. 30 సంవత్సరాలుగా అనేక ఉద్యమాలు చేస్తూ పలుసార్లు జైలు జీవితం గడిపారు. సిద్దిపేట జిల్లాలోని మల్లన్న సాగర్ ఉద్యమాల్లో భూ నిర్వాసితుల కోసం చేసిన ఉద్యమంలో 15 రోజుల పాటు సిద్దిపేట జైలులో శిక్షను అనుభవించారు. మల్లన్న సాగర్ భూ నిర్వాసితుల పోరాటాలలో తనపై పలు కేసులు నమోదయ్యాయి. తన ఉద్యమ జీవితంలో ఇప్పటివరకు 19 కేసులు నమోదు కావడంతోపాటు 28 రోజులు జైలు జీవితాన్ని గడిపారు. అజ్జమరి మల్లేశం విద్యార్థి దశ నుంచే కమ్యూనిస్టు భావాలను పునికి పుచ్చుకొని కమ్యూనిస్టు ఉద్యమాల వైపు కదిలారు. 1994 నుంచి ఇప్పటివరకు పూర్తి కాలం కమ్యూనిస్టు కార్యకర్తగా పనిచేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో మెదక్ రెవెన్యూ డివిజన్ ప్రాంతంలో పార్టీ ఆదేశాల మేరకు ప్రజా సంఘాల విస్తరణకు పార్టీ బలోపేతానికి కృషి చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లా కేంద్రంలో ట్రేడ్ యూనియన్ భూ పోరాటాలు కార్మిక ఉద్యమాలలో తీవ్రంగా పోరాటాలు చేశారు. రామచంద్రాపురం ప్రాంతంలో మండల పార్టీ కార్యదర్శిగా నాలుగు సంవత్సరాలు పని చేస్తూ ఆ ప్రాంతంలో ఉన్న కార్మికుల కోసం ఉద్యమించారు.నర్సాపూర్ డివిజన్ కార్యదర్శిగా నాలుగు సంవత్సరాలు పనిచేస్తూ నర్సాపూర్ ప్రాంతంలో పార్టీ విస్తరణ కోసం పటిష్టత కోసం పనిచేశారు. ఉమ్మడి జిల్లాలో ఐదు సంవత్సరాలు సిఐటియు ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2015లో ఉమ్మడి మెదక్ జిల్లా కార్యదర్శిగా ఎన్నికై ఇప్పటివరకు ప్రత్యేక జిల్లా కార్యదర్శిగా కొనసాగుతూ కార్మికులు రైతులు వ్యవసాయ కార్మికులు పేదల పక్షాన నిర్వాసితుల పక్షాన గుడిసెల పోరాటాలు చేస్తూ నిర్విరామ ఉద్యమాలు చేశారు. అంగన్వాడి వీఆర్ఏ ఆశా వర్కర్లు పారిశ్రామిక కార్మికులు విద్యుత్ ఉద్యోగులు పారిశుద్ధ్య కార్మికులు ఇతర రంగాల్లో పనిచేసే కార్మిక కర్షక ఉద్యోగుల కోసం అనేక సందర్భాల్లో ప్రత్యక్ష ఉద్యమాలు చేసి ప్రభుత్వంతో పోరాటాలు చేశారు. సిపిఐఎం పార్టీ అప్పగించిన బాధ్యతలో



భాగంగా కొన్ని సందర్భాలలో 1994లో మెదక్ బస్టాండ్ లో కడుపు కట్టుకొని బస్టాండ్‌లోని నిద్ర పోయిన సందర్భాలు న్నాయి. అతని భార్య అర్జుమర్రి కమల 10 సంవత్సరాలుగా సిపి ఐఎం పార్టీలో పూర్తిస్థా యి కార్యకర్తగా పని చేస్తున్నారు. అంగన్వా డి ఉద్యో గానికి రాజీనా మా చేసి నరసాపూర్ నియోజకవర్గంలో అనేక సందర్భాలలో ప్రజల ప్రజల కోసం ఉద్యమిస్తూ, పలు సందర్భాలలో పలుసార్లు జైలుకు వెళ్లారు. భూ పోరాటాలలో ఇద్దరు భార్యాభర్తలు కలిసి సంగారెడ్డి జైలులో జైలు జీవితాన్ని గడిపారు. ఉపాధి హామీ కార్మికుల పక్షాన జాబ్ కార్డుల కోసం రెండుసార్లు భార్యాభర్తలు ఇద్దరు జైలుకు వెళ్లిన సందర్భాలున్నాయి. సిపిఐఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రజల పక్షాన భార్యాభర్తలు ఉద్యమించడం చాలా అరుదైన విషయంగా భావించవచ్చు. తూప్రాన్ పట్టణంలో నిర్వహించిన సిపిఐఎం పార్టీ 15వ జిల్లా మహాసభలకు భార్యాభర్తలు ఇద్దరు ప్రతినిధులుగా పాల్గొనడాన్ని సిపిఐ(ఎం) రాష్ట్ర ప్రతినిధులు అభినందించారు.

పది రోజులు గడవకముందే మరో మర్డర్



నవతెలంగాణ-చిన్న శంకరంపేట

మండల కేంద్రంలోని ప్రయాణ ప్రాంగణం ఆవరణలో ఓ వ్యక్తిని హత్య చేసి పెట్రోల్‌తో కాల్చివేశారు. మృతదేహం బట్టలతో పాక్షికంగా కాలిపోయిన సంఘటన మెదక్ జిల్లా చిన్న శంకరం పేట మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చేగుంట టు మెదక్ ప్రధాన రహదారిపైన ఉన్న స్థానిక బస్టాండ్ ఆవరణలో గుర్తుతెలియని వ్యక్తిని హత్య చేసి పెట్రోల్‌తో తగలబెట్టారు. మృతుడి వయస్సు 30 సంవత్సరాలు ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. గత నెల 23వ తేదిన కూడా ఇదే రకంగా ఓవ్యక్తిని హత్య చేసి పెట్రోల్ పోసి తగలబెట్టిన విషయం తెలిసినదే. వరుస హత్యలకు కారకులెవరు అనే కోణంలో పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. వరుస హత్యలతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ హత్య చేయబడ్డ వ్యక్తులు ప్రైవేట్ కంపెనీలలో పని చేస్తున్న ఇతర రాష్ట్రాలకు చెందిన వారుగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు గతంలో హత్య చేయబడ్డ వ్యక్తి వివరాలు తెలియక ముందే పది రోజుల వ్యవధిలో మరో వ్యక్తి హత్య చేయబడ్డారు అనే కోణంలో పోలీసులు సీసీ కెమెరాలు ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టనున్నారు. ఇలాంటి వరుస హత్యలకు పాల్పడుతున్న వ్యక్తి ఒకే వ్యక్త ..లేదా మరో ఇతర వ్యక్తుల అనే కోణంలో పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. హత్య చేసిన వ్యక్తిని సీసీ ఫుటజీలను పరిశీలన చేసి నిందితులను త్వరలోనే పట్టుకుంటామని జిల్లా ఎస్పీ ఉదయకుమార్ రెడ్డి తెలిపారు. ఎస్పీతోపాటు డీఎస్పీ వెంకట్ రెడ్డి, సీఐ వెంకటరాజా గౌడ్, స్థానిక ఎస్సై నారాయణ గౌడ్, పోలీస్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకున్నారు.

జోరుగా కొనసాగుతున్న అక్రమ మట్టి దందా

5 టిప్పర్ లారీలు, ఒక హిటాచి పట్టివేత ,10 మందిపై కేసు నమోదు

తూప్రాన్ ఎస్ఐ శివానందం

నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి శివారులో ప్రభుత్వ భూముల నుంచి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న ఐదు టిప్పర్లను ఒక హిటాచిని తూప్రాన్ పోలీసులు పట్టుకొని పదిమందిపై కేసు నమోదు చేసినట్లు తూప్రాన్ ఎస్సై శివానందం విలేకరులతో తెలిపారు.





నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సిద్దిపేట
సోమవారం | 04 నవంబర్ 2024 | www.navatelangana.com

ఎలాంటి సమస్యలు తలెత్తినా తమ దృష్టికి తీసుకురావాలి

- విద్యుత్ ఏడీఈ వెంకట్ గౌడ్



నవతెలంగాణ-చేర్యాల

విద్యుత్ వినియోగదారులు ఎలాంటి విద్యుత్ సమస్యలు తలెత్తిన తమ దృష్టికి తీసుకురావాలని చేర్యాల ఏడీఈ వెంకట్ గౌడ్ అన్నారు.మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ డివిజనల్ కార్యాలయ ఆవరణలో ఆదివారం విద్యుత్ వినియోగదారుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ బావులు, ఇండ్లలో విద్యుత్ సమస్యలు తలెత్తితే అధికారులు, సిబ్బందికి తెలపాలని రైతులు, ప్రజలు రిపేర్లు చేసి ప్రమాదాల బారిన పడకుండా ఉండాలని సూచించారు. అవసరమైన సందర్భాలలో తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఏఈ కనకయ్య, కౌన్సిలర్ ఆడెపు నరేందర్, సిద్దులు గౌడ్, కాంగ్రెస్ నాయకులు అంబటి అంజయ్య గౌడ్ తో పాటు విద్యుత్ లైన్ మెన్ ప్రభాకర్ రెడ్డి, సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్ కొండాపూర్ రోడ్డును సొంత డబ్బులతో మరమ్మతు



నవతెలంగాణ-మిరుదొడ్డి

అధ్వానంగా ఉన్న తిమ్మాపూర్ కొండాపూర్ రోడ్డును తాత్కాలికంగా మట్టి పోయించడం పట్ల కొండాపూర్ ప్రజలు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు ప్రతిరోజు సిద్దిపేటకు వెళ్లాలంటే చుక్కలు చూడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. తిమ్మాపూర్ నుంచి కొండాపూర్‌కు వచ్చే రోడ్డు పూర్తిగా గుంతలమయం కావడంతో స్థానిక కొండాపూర్ గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకోవడంతో ఆయన సొంత ఖర్చుతో మట్టిని పోసి రోడ్డును తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. కొండాపూర్ గ్రామ ప్రజలు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి



నవతెలంగాణ-మర్కుక్

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేద బడుగు బలహీన వర్గాలకు ఎంతగానో అభివృద్ధి చెందుతుందని కాంగ్రెస్ దామరకుంట గ్రామాధ్యక్షులు పత్తి నర్సింలు యాదవ్ అన్నారు. గురుకుల పాఠశాలలు హాస్టల్ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం మెస్ చార్జిల పెంపుపై హర్షం వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది లక్షల 50 వేల మంది విద్యార్థులు ఈ పెంపుదల ప్రయోజనం చేకూరుతుందన్నారు.

ఇసుక అక్రమ రవాణ ట్రాక్టర్ పట్టివేత



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని గాగీల్లపూర్ గ్రామ శివారులోని మోయతుమ్మెద వాగు ఇసుకను ఆదివారం అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్(టీఎస్ 02 యూబీ 5520)పట్టుకుని పోలీస్ స్టేషనుకు తరలించి కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ క్రిష్ణారెడ్డి తెలిపారు.

రోడ్డు మరమ్మత్తు పనులు చేసిన జయశంకర్ ఫౌండేషన్



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి, పెద్దరాజుపేట గ్రామాల మధ్య ఉన్న మట్టి రోడ్డుకు ఆదివారం ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మరమ్మతులు చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షులు జింకల పర్వతాలు యాదవ్, వ్యవస్థాపక అధ్యక్షులు పొరెడ్డి అనిల్ మాట్లాడుతూ మట్టి రోడ్డు గుంతల మయంగా మారడం వల్ల వాహన దారులకు, ప్రజలకు జరుగుతున్న ఇబ్బందిని దృష్టిలో పెట్టుకొని ప్రజల సౌకర్యార్థం ఫౌండేషన్ తరపున ఈ మరమ్మత్తు పనులు చేపట్టినట్లు తెలిపారు.

డైట్, కాస్మొటిక్స్ చార్జీల పెంపు హర్షణీయం

- దుబ్బాక ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి.



నవతెలంగాణ-తొగుట

డైట్, కాస్మొటిక్ చార్జీల పెంపుతో రాష్ట్ర వ్యాప్తంగా 7 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం కలుగు తుందని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ఆర్థిక సమస్యలున్నా విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఒకే సారి 40 శాతం పెంచుతూ సీఎం నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. ఏండ్ల తరబడిగా విద్యార్థులు చాలీచాలని మెస్ చార్జీల తో పౌష్టికా హారం అందక అనారోగ్య బారిన పడ్డా రని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మెస్ ఛార్జీలు పెంచడం ద్వారా మెరుగైన పౌష్టి కాహారం లభిస్తుందన్నారు.

విద్యార్థులు నష్టపోకుండా కులగణన చేపట్టాలి



నవతెలంగాణ-బెజ్జంకి

విద్యార్థులు విద్యాపరంగా నష్టపోకుండా ఉపాధ్యాయులతో కులగణన చేపట్టాలని ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి వడ్లకొండ శ్రీనివాస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఉదయం పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యాబోధన చేసి..మధ్యాహ్నం కులగణన చేపట్టడం వల్ల గ్రామాల్లోని ప్రజలు కూలీ పనులకు వెళ్తుంటారని ప్రభుత్వం పునరాలోచన చేసి ఉదయం కుల గణన చేపట్టేలా చోరవచూపాలని శ్రీనివాస్ పేర్కొన్నారు.

జాతీయ ప్రయాస్ 2024కు దామరకుంట విద్యార్థులు ఎంపిక

నవతెలంగాణ-సిద్దిపేట

జాతీయ ప్రయాస్ 2024 తొలి జాబితాకు సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం జెడ్ పి హెచ్ ఎస్ దామరకుంట విద్యార్థులు వైష్ణవి, సింధుజ గైడ్ టీచర్ చిన్న బ్రహ్మయ్యల ఎంపికయ్యాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సిద్దిపేట డిగ్రీ కళాశాల జువాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ అయోధ్య రెడ్డి మార్గదర్శకత్వంలో వీరు ప్రాజెక్టు రూపకల్పన చేయడం జరిగిందనీ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనే ఒక జిల్లా పరిషత్తు పాఠశాల ప్రయాస్ 2024కు ప్రాజెక్టు ఎన్నిక కావడం అభినందనీయమని, ఇందుకు కృషి చేసిన గైడ్ టీచర్ చిన్న బ్రహ్మయ్యకు, సహకరించిన ప్రధానోపాధ్యాయులకు, విద్యార్థులకు జిల్లా సైన్స్ అధికారి కల్లేపల్లి శ్రీనివాస్ అభినందనలు తెలిపారు.

5న హ్యాండ్ బాల్ క్రీడాకారుల ఎంపికలు

నవతెలంగాణ-సిద్దిపేట

పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో హుస్నాబాద్ మినీ స్టేడియంలో ఉమ్మడి జిల్లాల అండర్ 14 బాల బాలికలకు హ్యాండ్ బాల్ ఎంపికలు ఈనెల 5 నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఎస్‌జిఎఫ్ కార్యదర్శి సౌందర్యలు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ హ్యాండ్ బాల్ ఎంపికల ఇన్చార్జిగా ఆర్.శ్రీనివాస్ పిడి 9440339486, రఫాత్ ఉమర్ పీఈటీ 9959569191లు వ్యవహరిస్తారని తెలిపారు. పాఠశాలకు 5గురు మాత్రమే పాల్గొనాలని, ఒరిజినల్ బోనఫైడ్‌తో హాజరు కావాలని సూచించారు.

వివాహ వేడుకల్లో పాల్గొన్న శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-తొగుట

మండల కేంద్రంలోని శ్రీనివాస్ - మౌనిక వివాహ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజక వర్గ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ కొంగరి నర్సింలు, నాయకులు నిరంజన్ రెడ్డి, బాలమల్లు, వధు వరుల కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం కుందన్వాని పల్లి గ్రామ పరిధిలో బైక్ అదుపు తప్పి కింద పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది.. ఎస్సై విజయభాస్కర్, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం కుందన్ వానిపల్లి గ్రామానికి చెందిన నోముల మల్లారెడ్డి (52) మద్యం సేవించి బైక్ పై వెళ్తుండగా ప్రమాదం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. దారి పొడుగున రైతులు వడ్ల కుప్పలు పోయడం వల్ల బైకు అదుపు తప్పినట్టు పోలీసులు తెలిపారు.

మల్లన్నను దర్శించుకున్న మున్సిపల్ చైర్ పర్సన్ దంపతులు



నవతెలంగాణ-చేర్యాల

కొమురవెల్లి మండల కేంద్రంలోని మల్లికార్జున స్వామిని ఆదివారం చేర్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూపారాణి శ్రీధర్ రెడ్డి దంపతులు కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారి ప్రసాదాన్ని అందించి ఆశీర్వదించారు.

తైక్వాండో విద్యార్థులకు హరీశ్‌రావు అభినందనలు



నవతెలంగాణ-సిద్దిపేట

ఇటీవల వికారాబాద్‌లో జరిగిన 68వ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ తైక్వాండో పోటీలలో సిద్దిపేట జిల్లా తైక్వాండో అసోసియేషన్ విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనబరి చినందుకు మాజీమంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు అభినం దించారు. ఆదివారం క్యాంప్ కార్యాలయంలో అండర్ 14 విభాగంలో పి పురంధర, అండర్ 20 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్, ఎం పునీత్ రెడ్డి, అండర్ 29 కేజీల విభాగంలో సిల్వర్, ఈ. నిశాంత్ అండర్ 32 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్, టీ. తనీష్ వినయ్ అండర్ 41 కేజీల విభాగంలో బ్రాంచ్ మెడల్ సాధించారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజనర్సు, మా రెడ్డి రవీందర్ రెడ్డి, పాల సాయిరాం, మచ్చ వేణుగోపాల్ రెడ్డి, సిద్దిపేట జిల్లా తైక్వాండో కార్యదర్శి రాచకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

దుబ్బాక ఎమ్మెల్యే కృషి అభినందనీయం

- పద్మనాభునిపల్లిలో తాత్కాలిక రోడ్డు పనులు షురూ
- గ్రామస్తులు పక్షాన కృతజ్ఞతలు
- మాజీ జడ్పీటీసీ రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ పర్శరాములు



నవతెలంగాణ-దుబ్బాక రూరల్

తిమ్మాపూర్ నుంచి అందే వరకు రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో ప్రజల ప్రయాణానికి, వాహనదారులకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. ఈ సమస్యను గత రెండేళ్ల నుంచి దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి దృష్టికి మాజీ జడ్పీటీసీ కడతల రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ పర్శారాములు తీసుకెళ్తూ వచ్చారు. తాజాగా దుబ్బాక ఎమ్మెల్యే ఆర్ అండ్ బీ అధికారులతో మాట్లాడడంతో ఆదివారం తిమ్మాపూర్ నుండి పద్మనాభునిపల్లి వరకు తాత్కాలిక రోడ్డు పనులు జరిగాయి. దీంతో గ్రామస్తులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దుబ్బాక ఎమ్మెల్యే కృషి వల్ల గత 12 ఏళ్లుగా ఎదుర్కొంటున్న తిమ్మాపూర్ పద్మనాభుని పల్లి, కొండాపూర్,అందే గ్రామాల సమస్య తీరనుందని ఆయా గ్రామాల ప్రజలు పక్షాన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డికి మాజీ జడ్పీటీసీ రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ పర్శరాములు తెలిపారు. త్వరలోనే డబుల్ రోడ్ నిర్మాణ పనులు జరుగుతాయని అధికారులకు దుబ్బాక ఎమ్మెల్యే ఆదేశించారని అభిప్రాయం వ్యక్తం చేశారు.

నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు





నవతెలంగాణ-తొగుట

మండలంలోని వెంకట్రావు పేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యూత్ లీడర్ పిట్ల వెంకటేష్ ఆదివారం నూతన గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డా.వంటేరు యాదవ రెడ్డి,, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిలు పాల్గొన్నారు. వెంకటేష్ కుటుంబ సభ్యులకు వారు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వెంకటేష్ కుటుంబ సభ్యులు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలకు శాలువాతో సన్మానిం చారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపిటిసి వేల్పుల స్వామి, గ్రామ పార్టీ అధ్యక్షులు పులిగారి శివయ్య, తగరం అశోక్, బండారు స్వామి గౌడ్, పిట్ల వెంకట య్య, పాత్కుల బాలేష్, ఈదుగల్ల పర్శరాములు, తడ్కం నర్సింహారెడ్డి, ఎంగలి నరేందర్, అజాం, బెజ్జ నమైన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు విరమణ సర్వసాధారణం



నవతెలంగాణ-రాయపోల్

ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సర్వసాధారణమేనని ఉద్యోగులందరూ పదవీ కాలం పూర్తయిన తర్వాత తప్పనిసరిగా విరమణ తీసుకుంటారని ముబారస్‌పూర్ తాజా మాజీ సర్పంచ్ యాదగిరి, ఎంపీటీసీ తిరుపతిలు అన్నారు. ఆదివారం దౌల్తాబాద్ మండలం ముబారస్ పూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందుతున్న యూనిస్‌ఖాన్‌కు ఘన సన్మానం చేసి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముబారస్‌పూర్ గ్రామంలో గత ఏడు సంవత్సరాలుగా గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించిన యూనిస్‌ఖాన్ పదవి విరమణ చెందడం వలన గ్రామంలో ఆయన సేవలు కోల్పోతున్నామన్నారు. గ్రామ అభివృద్ధిలో ప్రజల సమస్యల పరిష్కారంలో గ్రామపంచాయతీ కార్యదర్శుల పాత్ర ఎంతో కీలకమన్నారు. యూనిస్‌ఖాన్ శేషజీవితంలో ఆయురారోగ్యాలతో ఉండి తన జీవితాన్ని ప్రజాసేవకు కేటాయించాలన్నారు. పదవికే విరమణ కానీ ప్రజాసేవకు విరమణ కాదని పేర్కొన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి యూనిస్ ఖాన్ మాట్లాడుతూ తాను కుటుంబ సభ్యుల కంటే ఎక్కువ సమయం గ్రామ ప్రజలతోనే గడపడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు లక్ష్మణ్, శ్రీనివాస్, లింగం, రాములు, నాగరాజు, రాములు, సత్తయ్య పాల్గొన్నారు.

మూఢనమ్మకాలను విడనాడి శాస్త్రీయ దృక్పథంతో జీవించాలి

- దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్ దీప్



నవతెలంగాణ-రాయపోల్

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మూఢనమ్మకాలు నమ్మరాదని దౌల్తాబాద్ ఎస్సై శ్రీరామ్ ప్రేమ్ దీప్ అన్నారు. సైబర్ నేరాలు, మూఢనమ్మకాలు, గంజాయి ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలని కోరుతూ శనివారం రాత్రి దౌల్తాబాద్ మండలం ముత్యంపేట గ్రామంలో పోలీస్ కనువిప్పు ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో తల్లిదండ్రులు పాఠశాల, కాలేజీకి వెళ్లే పిల్లల ప్రవర్తనను గమనిస్తుండాలన్నారు. అవసరం మేరకే సెల్‌ఫోన్ వాడాలి, గూగుల్ పే, ఫోన్‌పే చేసేటప్పుడు జాగ్రత్తగా ఉపయోగించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడిపి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు.గంజాయి ఇతర మత్తు పదార్థాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. సిద్దిపేట పోలీస్ కళాబృందం సభ్యులు బాలు, రాజు, తిరుమల, తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం సభ్యులు రవి,రవీందర్,ఎల్లయ్య,తిరుమలయ్య, భార్గవి,రవీందర్ నాటకం పాటల రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ బిఖ్యా నాయక్, ప్రజలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఇల్లు దగ్దమైన కుటుంబాన్ని ఆదుకుంటాం

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి.



నవతెలంగాణ-రాయపోల్

షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదవశాత్తు పెంకుటిల్లు దగ్దమైన కుటుంబాన్ని ఆదుకుంటామని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం దౌల్తాబాద్ మండలం గాజులపల్లి గ్రామంలో షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్దమైన కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదవశాత్తు పెంకుటిల్లు పూర్తిగా దగ్ధమవడం చాలా బాధాకరమని, ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడం వల్ల ప్రాణాపాయం తప్పిందన్నారు. ఈ ప్రమాదంలో మారుపాక అర్జున్ ఇంట్లో వస్తువులు, నిత్యావసర సరుకులు, బియ్యం, డబ్బులు, బంగారం పూర్తిగా కాలిపోయాయని దానితో పెద్ద ఎత్తున నష్టం వాటిల్లిందన్నారు. తక్షణ సహాయంగా నిత్యావసర వస్తువుల కోసం ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందని, అర్జున్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వెంటనే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలన్నారు. ధైర్యంగా ఉండాలని అర్జున్ కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో గాజులపల్లి తాజా మాజీ సర్పంచ్ అప్పవారి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు నర్ర రాజేందర్, స్వామి, గొల్లపల్లి ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాలేయ సమస్యతో విలపిస్తున్న పసి హృదయం

- కాలేయ మార్పిడికి రూ.35 లక్షల ఖర్చు
- పేద కుటుంబానికి తప్పని ఆర్థిక ఇబ్బందులు
- ఆపన్న హస్తం కోసం తల్లిదండ్రుల ఎదురుచూపు





నవతెలంగాణ-కోహెడ

తల్లిదండ్రుల రెక్కల కష్టంతో అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న చిన్నారికి కాలేయవ్యాధి సమస్య తోడై ఆ కుటుంబ సంతోషాల్ని వెనక్కి నెట్టేసింది. తోటి చిన్నారులతో ఆడుతూ.. పాడుతూ గడపాల్సిన నాలుగేళ్ల చిన్నారి పెద్ద జబ్బు బారిన పడి లివర్ సంబందిత సమస్యతో ఇబ్బందులు పడుతుంది. శస్త్ర చికిత్సకు అవసరమైన ఆర్థికస్థోమత లేక ఆపన్నహస్తం కోసం తల్లిదండ్రులు ఎదురు చూస్తున్న పరిస్థితి నెలకొంది. కోహెడ మండలంలోని శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన పున్నం శిరీష-రాజశేఖర్ దంపతులకు 4 సంవత్సరాల కూతురు (రియాన్షిక) గత రెండు నెలలుగా కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతుంది. దీంతో పలు ఆసుపత్రులలో వైద్యం కోసం తల్లిదండ్రులు తిరుగుతున్నారు. ప్రస్తుతం హైద్రాబాద్‌లోని రేన్‌బో బంజారహిల్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతుంది. డాక్టర్స్ చిన్నారికి కాలేయ మార్పిడి చేయాలని కాలేయ మార్పిడికి రూ.35 లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. రెక్కాడితే కాని డొక్కాడని కుటుంబానికి ఇప్పుడు పెద్ద ఆపద వచ్చింది... ప్రేమ ఆప్యాయతలతో అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న ఆ పాప తల్లిదండ్రులు మా పాప ప్రాణాన్ని నిలబెట్టమని ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే వైద్య ఖర్చుల కోసం 8 లక్షల వరకు ఖర్చు చేశామని తెలిపారు. దాతల సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. సహాయం అందించాలనుకునే వారు ఫోన్ పే నంబర్ 9848924347 పోలు శ్రీనివాస్, గూగుల్ పే 9666338616 బండిపెల్లి శ్రీకాంత్ నంబర్‌లకు సహాయం అందించాలని వేడుకుంటున్నారు.

పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ దాడులు

- తొమ్మిది మంది అరెస్టు, రూ. 31,919 నగదు, 9 ఫోన్లు స్వాధీనం

నవతెలంగాణ-వర్గల్

పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్, పోలీసులు దాడి చేసి తొమ్మిది మందిని అరెస్టు చేయడంతో పాటు, రూ. 31,919 నగదు, 9 ఫోన్లు స్వాధీనం చేసుకున్న ఘటన గౌరారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. టాస్క్‌ఫోర్స్ పోలీసులు. గౌరారం ఎస్సై కరుణాకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం మీనాజీ పేట గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారని నమ్మదగిన సమాచారం మేరకు రైడ్ చేసినట్లు తెలిపారు. నరసింహారెడ్డి, ఎర్రోళ్ల గిరి, కుమార్, దేవేందర్, రాజు, సురేష్, వెంకటేష్, కుమార్,రాజులను ఆదుపులోకి తీసుకున్నారు. అల్లాడి మహేశ్ పరారీలో ఉన్నాడని తెలిపారు. వారి వద్ద రూ. 31,919 నగదు, 9 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే టాస్క్ ఫోర్స్ అధికారుల నెంబర్లు 8712667445, 8712667446, 8712667447లకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఎస్సై కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో, పట్టణాలలో ఫామ్ హౌస్ లలో, ఇళ్లల్లో పేకాట, బహిరంగ ప్రదేశాల్లో జూదం , ఇతర చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు ఎవరైనా నిర్వాహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు

- కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-రాయపోల్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజా పాలనకు ఆకర్షితులై బీఆర్ఎస్, బీజేపీల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఆదివారం హైదరాబాద్ తన నివాసంలో రాయపోల్ మండలం రామారం గ్రామానికి చెందిన బీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థ ఎన్నికలలో కూడా కాంగ్రెస్ పార్టీ సత్తా చాటుతుందన్నారు. రామారం గ్రామం నుంచి సుమారుగా 40 మంది బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరడం శు భపరిణామమన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో తాజా మాజీ ఉపసర్పంచ్ సాగర్, బిజెపి నాయకులు గోపాల్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గొల్లపల్లి కనకయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తప్పెట సుధాకర్, దుర్గాప్రసాద్, గొల్లపల్లి మహేష్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు దగ్ధమైన కుటుంబానికి బియ్యం అందజేత



నవతెలంగాణ-రాయపోల్

మూడు రోజుల క్రితం షాట్ సర్క్యూట్‌తో ప్రమాదవశాత్తు పెంకుటిల్లు దగ్ధమైన కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు గాజులపల్లి తాజా మాజీ వార్డు సభ్యులు సత్యపాల్. ఆదివారం దౌల్తాబాద్ మండలం గాజులపల్లి గ్రామంలో విద్యుత్ షాక్ తో ఇల్లు దగ్దమైన మారుపాక అర్జున్ కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జున్ ఇల్లు పూర్తిగా దగ్ధమవడం చాలా బాధాకరమని, వారి కుటుంబానికి తన వంతు సహకారంగా 50 కిలోల బియ్యం అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గాజులపల్లి తాజా మాజీ సర్పంచ్ అప్పవారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ ఆశ్రమానికి రూ. 5 వేల ఆర్థిక సహాయం



నవతెలంగాణ-రాయపోల్

అమ్మ నాన్న అనాథ సేవా ట్రస్ట్ అనాథ వృద్ధాశ్రమానికి ఐదువేల రూపాయల ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందని కాంగ్రెస్ నాయకులు సూరంపల్లి ప్రవీణ్ తెలిపారు. ఆదివారం దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ గ్రామంలో అమ్మ నాన్న అనాథ సేవా ట్రస్ట్ ఆశ్రమ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సమాజంలో కుటుంబ విలువలు, బంధాలు రోజురోజుకీ తగ్గిపోతున్నాయని మానవత్వం మరిచి కన్న తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలలో ఉంచే పరిస్థితి ఏర్పడిందన్నారు. వివిధ ప్రమాదాల వలన తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు కూడా అనాథ ఆశ్రమంలో ఆశ్రమం పొందుతున్నారు. అలాంటి వారి బాగోగుల కోసం అమ్మ నాన్న అనాథ సేవా ట్రస్ట్ ఘట్కేసర్ హైదరాబాద్ ఆశ్రమం వారు విరాళాల సేకరణ కోసం గ్రామాలలో తిరుగుతున్నారని దానిలో భాగంగానే ఇందుప్రియాల్ గ్రామంలో తిరిగే క్రమంలో ఆశ్రమంలోని వృద్ధులు పిల్లల పరిస్థితిలు వివరించేసరికి తీవ్రంగా కలత చెందడం జరిగిందన్నారు.తన వంతు సహకారంగా ఆర్థిక సహాయం అందజేశానని తెలిపారు. ఆశ్రమ సభ్యులు ప్రవీణ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ నాన్న అనాథ సేవా ట్రస్ట్ సభ్యులు శివ, హనుమంతు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ మేయర్ పరామర్శ



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని బేగంపేట గ్రామానికి చెందిన ఎలా నరేశ్ బాబు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆదివారం కరీంనగర్ నగర మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గుంజపడుగు హరిప్రసాద్, కేమసారం తిరుపతి, శాతవాహన యూనివర్సిటీ విద్యార్థి నాయకులు అయన వెంట ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
సోమవారం | 04 నవంబర్ 2024 | www.navatelangana.com

కొనుగోలు కేంద్రాల్లో గోనె సంచులు లేక రైతుల అవస్థలు

- ధాన్యం దళారులకు అమ్ముకుంటున్న రైతులు
- పట్టించుకోని అధికారులు
- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు తాడూరి రవీందర్



నవతెలంగాణ-కొమురవెల్లి

వడ్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా గోనె సంచులు లేక రైతుల అవస్థలు పడుతున్నారని సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కమిటీ సభ్యులు తాడూరు రవీందర్ అన్నారు. మండలంలోని అయినాపూర్ గ్రామ వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం సీపీఐ(ఎం) గ్రామ శాఖ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులను అధికారులు పట్టించుకోకపోవడంతో దళారులకు ధాన్యం అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులను పట్టించుకునే నాథుడు కరువయ్యాడని దుయ్యబట్టారు వెంటనే గోనె సంచులు తెప్పించి కాంటాలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల నాయకులు తేలు ఇస్తారి, గ్రామ కార్యదర్శులు సున్నం యాదగిరి, కానుగుల రాజు, పాశం చంద్రయ్య, దయ్యాల అనిల్, మల్లం యాదయ్య , శివయ్య తేలు బాలమల్లు, రాములు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తున్నాం

- ఏడీఈ సుదీర్ బాబు



నవతెలంగాణ-బెజ్జంకి

విద్యుత్ వినియోగదారుల సమస్యలకు సత్వర పరిష్కారం చేస్తున్నామని ఏడీఈ సుదీర్ బాబు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని ఏడీఈ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల దినోత్సవం ఏడీఈ సుదీర్ బాబు నిర్వహించారు. అన్ని క్యాటగిరిల వారికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని సరఫరాలో తలెత్తిన సమస్యల పరిష్కారానికి విద్యుత్ సిబ్బందితో కృషి చేస్తున్నామని, పలువురు రైతులు సమస్యలను ఏడీఈ దృష్టికి తీసుకువెళ్లారు. పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారించేలా శాయశక్తుల కృషి చేస్తామని ఏడీఈ తెలిపారు. ఏఈ మహేశ్, బస్వాపూర్, ఏఈ రామాంజనేయులు, సబ్ ఇంజనీర్ పవన్, రైతులు పాల్గొన్నారు.

వచ్చిందే అరకొర..అందులో దోపిడి..!

- కుదేలవుతున్న పత్తి రైతులు
- మద్దత ధర అందని ద్రాక్షే..
- మిల్లుల యజమానుల దోపిడి చేస్తున్నారని ఆరోపణలు
- చోద్యం చూస్తున్న మార్కెటింగ్ అధికారులు
- సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్

నవతెలంగాణ-బెజ్జంకి

ఎన్నో ఆశలతో..ఎన్నో ఒడిదోడుకులను ఎదుర్కొని రైతులు పంటలు సాగు చేశారు. సాగు చేసిన పంటలపై ఆకాల వర్షాలు తీవ్ర ప్రభావం చూపాయి.పంట చెలల్లో నీరు నిలువడంతో పత్తి పంటలు తెగుళ్ల బారిన పడ్డాయి.తెగుళ్ల బారిన పడిన పత్తి పంటలు అరకొర దిగుబడి నిస్తున్నాయి. వచ్చిన అరకొర దిగుబడిని విక్రయించుకుంటే మిల్లుల యజమానులు తేమ, తెగుళ్ల బారిన పడిదంటూ, నాణ్యత లేదంటూ అందినకాడికి దోపిడి చేస్తున్నారని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆకాల వర్షాలు రైతులకు కన్నీళ్లు మిగిల్చాయంటే.. ఇప్పుడు మిల్లుల యజమానులు కుమ్మక్కయి మరింత దోపిడి చేస్తున్నారని బహిరంగంగానే రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించడంలో ఆలసత్వం, మార్కెటింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మిల్లుల యజమానులు ఇష్టారీతిన దోపిడికి పాల్పడుతున్నారని.. ఇప్పటికైన సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలని ప్రభుత్వాన్ని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. రైతులను దోపిడి చేస్తున్న మిల్లుల యజమానులపై చర్యలు చేపట్టి అధికారులు రైతులపై తమ చిత్తశుద్ధిని చాటుకోవాలని కోరుతున్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రమేది?

ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు మిల్లుల యజమానులు పత్తిని కొనుగోళ్లు చేయాలి. ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించకపోవడంతో మండలంలోని పత్తి మిల్లుల యజమానులు గతేడాది మద్దతు ధరకంటే తక్కువ కొనుగోలు చేసి దొచుకుంటున్నారని రైతులు చెబుతున్నారు.పంట పెట్టుబడుల సమయంలో వడ్డీలకు రైతులకు అప్పులిచ్చిన పలువురు వడ్డీ వ్యాపారులు రైతుల వద్ద పత్తి కొనుగోళ్లు చేసి మిల్లుల్లో అధిక ధరకు విక్రయించుకుంటున్నారని అపోహలు వినిపిస్తున్నాయి. మిల్లుల యజమానులు మద్దతు ధర చెల్లించనప్పుడు సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి. మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. రైతులకు మద్దతు ధర కల్పించడంతో ప్రజా ప్రతినిధులు, అధికారులు విఫలమయ్యారు. రైతులు వ్యాపారుల మాయాజాలంలో చితికిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



సమారు 8 ఎకరాల విస్తీర్ణంలో పత్తి పంట సాగు చేశాను.ఎకరానికి సుమారు 14 క్వింటాళ్ల పత్తి దిగుబడి రావాల్సింది. అకాల వర్షాలు, తెగుళ్ల బారిన పడి ఎకరానికి సుమారు 6 క్వింటాళ్ల దిగుబడి వచ్చే దుస్థితి నెలకొంది. అరకొర దిగుబడి విక్రయిస్తామనుకుంటే మిల్లుల యాజమానులు కుమ్మక్కై అందినకాడికి దొచుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతులకు బాసటగా నిలవాలి.

కల్లూరీ రమేశ్,పత్తి రైతు బెజ్జంకి

సీసీఐ ఏర్పాటుకు సన్నహాలు చేస్తున్నాం



ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతులకు బాసటగా నిలువాలనే సంకల్పంతో మండలంలో సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు సన్నహాలు చేస్తున్నాం. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రత్యేక చొరవ చూపి సీసీఐ అధికారులతో మట్లాడారు. ఈ నెల 5వ తేదిన మంగళవారం సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించనున్నారు. రైతులు సమన్వయం పాటించాలి.

పులి క్రిష్ణ,ఏఎంసీ చైర్మన్,బెజ్జంకి

సీఎం రేవంత్ రెడ్డికి పాలాభిషేకం



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

రాష్ట్రవ్యాప్తంగా గురుకుల సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు ఉంచడంపై ఆదివారం హుస్నాబాద్ పట్టణంలోని హుస్నాబాద్ ఉమ్మడి మండల గిరిజన సంక్షేమ గురు కుల పాఠశాలలో కళాశాల విద్యార్థులు, పాఠశాల ప్రిన్సిపల్ అనిత సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అనిత మాట్లాడుతూ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు చార్జీలు పెంచడం సంతోషకరమన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి విద్యార్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీల పెంపు పట్ల హర్షం



నవతెలంగాణ-గజ్వేల్

గురుకుల పాఠశాలలు హాస్టల్ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం మెస్ చార్జిల పెంపుపై బీసీ సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కొమ్ము ఉమేష్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. బీసీ జిల్లా ఆఫీసులోనాయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డికి ఉప ముఖ్యమంత్రి, బట్టి విక్రమార్కకు, బిసి మంత్రి పొన్నం ప్రభాకర్ దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, బిసి మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పెంపుదల వల్ల రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది లక్షల 50 వేల మంది విద్యార్థులు ప్రయోజనం కలిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు అకారం రాజు యాదవ్, విద్యార్థి సంఘం అధ్యక్షుడు కొమ్ము రాజు, టౌన్ కార్యదర్శి ప్రవీణ్, తిరుపతి, మహేష్, రాజు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాజును సన్మానించిన మైనార్టీలు



నవతెలంగాణ-గజ్వేల్

టీవైఆర్ కాంప్లెక్స్‌లో ఆర్చరీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన హైకోర్టు న్యాయవాది గజ్వేల్ నివాసి తలకొక్కుల రాజును ముస్లిం మైనార్టీలు ఆదివారం ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ఆర్చరీ క్రీడా అధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ డివిజన్ అధ్యక్షులు గులాం అహ్మద్ అజీజ్, సీనియర్ డీలర్ కుమారస్వామి, సయ్యద్ ముస్తఫా, ఇంతియాజ్, గజ్వేల్ కోట్ లాయర్స్ వలంకొండ శ్రీనివాస్, కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు నేతి సంతోష్, రైస్ మిల్ అధ్యక్షులు ప్రభాకర్ పద్మశాలి సంఘం అధ్యక్షులు రాజారామ్ తదితరులు పాల్గొన్నారు.


పోగొట్టుకున్న ఫోన్‌ను అప్పగించిన పోలీసులు



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో హమాలి కార్మికుడు మల్లయ్య ఆదివారం ఫోన్ పోగొట్టుకున్నాడు. దీంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఫోన్ పోయిన అరగంటలోనే ఫోన్ దొరకబట్టి సంబంధిత వ్యక్తికి అప్పగించి పోలీసులు శభాష్ అనిపించుకున్నారు. సీఐ శ్రీనివాస్ ఎస్సై మహేష్ ఆదేశాలతో హెడ్ కానిస్టేబుల్ మొగిలినాయక్ ఫోను సిగ్నల్ ఆధారంగా ట్రాక్ చేసి అరగంటలోపే పట్టుకుని ఫోనును మల్లయ్యకు అప్పగించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ మొగిలినాయక్‌ను ఏసీపీ సతీష్, సీఐ శ్రీనివాస్, ఎస్సై మహేష్ అభినందించారు.


బాధితులకు సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ అందజేత



నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని సలా క్ఫూర్ గ్రామానికి చెంది న బియ్య రాకేష్ కిడ్నీ మార్పిడి కోసం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్ కుమార్ నాలుగు లక్షల రూపాయల సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ పత్రాన్ని బాధితునికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బియ్య రాకేష్ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడని మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకు వెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి నాలుగు లక్షల రూపాయల సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ మంజూరు చేయించారని, ఆ పత్రాన్ని బాధిత కుటుంబసభ్యులకు అందజేశామన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, సహకరించిన నాగపురి కిరణ్ కుమార్‌కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి బుచ్చిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ ఉపాధ్యక్షుడు ఎర్ర మల్లేష్, ఏలేకట్టే శ్రీనివాస్, పుల్లని నరసింగరావు, నారాయణ గౌడ్, బియ్య కిష్టయ్య, సింగిరెడ్డి పుల్లారెడ్డి, బర్రె కృష్ణారెడ్డి, ఎర్ర ఆనందం, గడిపి ప్రభాకర్, కామస్వామి, ఎర్ర రాజు, బ్రహ్మం, ఉదయ్, రవి, రాజు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం



నవతెలంగాణ-కొండపాక

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కుకునూరుపల్లిలో 2012-2013 సంవత్సరము న 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థిని విద్యార్థు లు వారి ఉపాధ్యాయులను సన్మానించుకొని వారు చేసిన కృషిని అభినందిస్తూ వారి సేవలను ఎన్నడు మరువలేనివని తెలిపారు. విద్యార్థిని విద్యార్థులు వారి అనుభూతులను ఉపాధ్యాయులతో ఉన్నటువంటి సన్నిహిత్యాన్ని జ్ఞాపకం చేసుకుంటూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. దాదాపుగా 11 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులు కలుసుకొని ఆనంద పరవశమయ్యారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజు శ్రీనివాస్ చారి చంద్రభాను రవి సార్ కనక లక్ష్మి మల్లయ్య సాజిద్‌లు ఉపాధ్యాయులను సన్మానించారు విద్యార్థులు బాబు మధు స్వామి ప్రశాంత్ రాజు, శ్రీకాంత్ ఈశ్వర్ రమేష్ కరుణాకర్ రాజు ప్రమీల శ్యామల జ్యోతి మంగ కృష్ణ తదితరులు పాల్గొన్నారు

టీపీటీఎఫ్ జోన్ కన్వీనర్‌గా జల్లెల శ్రీనివాస్ ఎంపిక



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ టీపీటీఎఫ్ జోన్ కన్వీనర్‌గా జల్లెల శ్రీనివాసును నియమించినట్లు జోన్ సలహాదారులు రాజులు, పాపిరెడ్డి తెలిపారు. ఆదివారం జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు వారు చెప్పారు. ఈ సందర్భంగా జోన్ కన్వీనర్‌గా నియమితులైన శ్రీనివాస్ మాట్లాడుతూ కులగణన కార్యక్రమానికి ఇతర ఉపాధ్యాయులను కూడా నియమించాలని ఆయన కోరారు. పాఠశాల సమయంలో కాకుండా ఉదయం సగం పూట బడి మాత్రం ఏర్పాటు చేసి మిగతా సమయాన్ని కులగణనకు సమయం ఇచ్చేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రాథమిక పాఠశాల వ్యవస్థను నిర్వీర్యం చేయడమే అవుతుందన్నారు. దీని ద్వారా ప్రభుత్వ పాఠశాలలో మరింత బలహీనపడే అవకాశం ఉందని ప్రైవేట్ విద్యా రంగాన్ని ప్రోత్సహించే విధంగా ఉందన్నారు. ఉదయం పూటనే సర్వే ఉండే విధంగా ప్రభుత్వం నిర్ణయించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్, పాల్గొన్నారు.

ఫుడ్ పాయిజన్‌కు కారణమైన వారిపై చర్యతీసుకోవాలి

- డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి



నవతెలంగాణ-గజ్వేల్

కుమురంభీమ్ జిల్లా వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ జరగడంతో విద్యార్థినులు ఆసుపత్రి పాలయ్యారని, దీనికి కారణమైన వారిపై చర్యతీసుకోవాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి ప్రభుత్వాన్ని కోరారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కారణంగా చవాతి గ్రామానికి చెందిన శైలజ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు మాక్స్ కేర్ ఆసుపత్రిలో వెంటిలేటర్‌పై ఆమెకి చికిత్స అందిస్తున్నారన్నారు. ఆసిఫాబాద్ లైఫ్ లైన్ ఆసుపత్రిలో మరో 12 మంది విద్యార్థులకు చికిత్స అందిస్తున్నారన్నారు. ఫుడ్ పాయిజన్‌కు కారణమైన హెచ్ఎం, వార్డెన్లను సస్పెండ్ చేయాలని డీబీఎఫ్ డిమాండ్ చేస్తుందన్నారు.

ఉద్యోగులకు బెనిఫిట్స్ అందించకపోవడం దుర్మార్గం

- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు



నవతెలంగాణ-సిద్దిపేట

కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు రిటైర్మెంట్ డబ్బులు వారికి రావాల్సిన పూర్తి బెనిఫిట్స్ అందించకపోవడం దుర్మార్గమని ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ఆదివారం స్థానిక విపంచి కళానిలయంలో టీపీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయుడు పొన్నమల్ల రాములు పదవీ విరమణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే పీఆర్సిని ప్రకటిస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి ఇప్పటివరకు దాని ఊసే లేదన్నారు. అడ్డగోలు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ఉద్యోగులను నమ్మించి మోసం చేశారన్నారని ఉద్యోగాలకు విరమణ ఉంటుంది కానీ ఉపాధ్యాయ వృత్తికి విరమణ ఉండదని, ఉద్యోగానికి విరమణ అవుతారేమో కాని సామాజిక బాధ్యతకు రిటైర్మెంట్ ఉండదన్నారు. తెలంగాణ ఉద్యమంలో, మద్యపాన నిషేధ ఉద్యమంలో, సిద్దిపేట, దుబ్బాక ప్రాంతాల్లో రైతు ఆత్మహత్యలు చేసుకుంటుంటే వారి కుటుంబాలను ఆదుకునే విషయంలో మాతోపాటు రాములు కలిసి పనిచేశారన్నారు. అందుకే వారు ఉద్యోగ పదవీ విరమణ పొందారేమో కాని, సామాజిక బాధ్యత విషయంలో వారికి పదవీ విరమణ లేదన్నారు. సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్డ్ అయిన చివరి రోజు లేదా వారం రోజుల్లో వారికి రావాల్సిన రిటైర్మెంట్ డబ్బులు పూర్తి బెనిఫిట్స్‌ను ప్రభుత్వం అందించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం రిటైర్మెంట్ డబ్బులు మూడు సంవత్సరాల తర్వాతే అందుతాయని ప్రభుత్వం చెప్పడం దురదృష్టకరమన్నారు. బహుశా రిటైర్ అయిన మూడు సంవత్సరాలకు రిటైర్మెంట్ డబ్బులు ఇచ్చేది తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. ఈ డిసెంబర్ వస్తే ఉద్యోగులకు 6 డీఏలు కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వాల్సి ఉంటుందని, ఒక డీఏ మాత్రమే వచ్చి చేతులు దులిపేసుకున్నదన్నారు. ఓల్డ్ పెన్షన్ విధానం అమలు చేస్తామని హామీనిచ్చిన కాంగ్రెస్ ఇప్పటివరకు దాని విధివిధానాలను ప్రకటించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు 7000 మంది ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్డ్ అవుతే, ఒకరికి కూడా రిటైర్మెంట్ డబ్బులు కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. 20, 30 సంవత్సరాలు కష్టపడి ఉద్యోగం చేసి దాచుకున్న డబ్బును ప్రభుత్వం ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి, ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పారుక్ హుస్సేన్, తిరుపతి రెడ్డి, విజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాదవుల సాంస్కృతిక సమ్మేళనం సదర్ ఉత్సవం

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



నవతెలంగాణ-తొగుట

యాదవుల సాంస్కృతిక సమ్మేళనం సదర్ ఉత్సవమని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం రాత్రి మండలంలోని కాన్గల్ గ్రామంలో జరిగిన సదర్ ఉత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ దీపావళి పండుగ తర్వాత సదర్ ఉత్సవంను గతంలో జంట నగరాల్లో ఘనంగా నిర్వహించుకునే వారని, నేడు గ్రామాల్లో నిర్వహిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. దుబ్బాక నియోజకవర్గంలో సదర్ ఉత్స వాలను నిర్వహిస్తున్న రెండో గ్రామంగా కాన్గల్ నిలిచిందన్నారు. ఈ ఉత్సవం ఏర్పాటు చేసిన యాదవ సోదరులకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో యాదవ సంఘం నిర్వాహ కులతో పాటు మండల పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి, వైస్ ఎంపీపీ బసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ దోమల కొమురయ్య, నాయకులు ముడికే కనకయ్య, స్వామి, గణేష్, బాలరాజు పాల్గొన్నారు.

బడుగు బలహీనవర్గాల పార్టీ తెలుగుదేశం

- కార్యకర్తలు కష్టపడి పార్టీకి పూర్వ వైభవ తేవాలి
- హుస్నాబాద్‌లో తెలుగుదేశం పార్టీ సభ్యత నమోదు
- జాతీయ ప్రధాన కార్యదర్శి పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

బడుగు బలహీనవర్గాలకు అన్ని విధాలుగా మంచి చేయాలనే సంకల్పంతో పుట్టిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని జాతీయ ప్రధాన కార్యదర్శి పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు అన్నారు. ఆదివారం నియోజకవర్గ ఇంఛార్జ్ బత్తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క నాయకుడు కష్టపడి పూర్తి స్థాయిలో పార్టీకి పూర్వ వైభవాన్ని తీసుకురావాలని కోరారు. ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడి పనిచేయాలని, కష్టపడిన వారికి కచ్చితంగా పార్టీ గుర్తిస్తుందన్నారు. అనంతరం కరీంనగర్ పార్లమెంటరీ కన్వీనర్ వంచ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు విజనరీతో, నారా లోకేష్ సాంకేతికతో నిరంత రం కార్యకర్తల సంక్షేమం కోసం పాటు పడుతున్నారన్నారు. గతంలో రూ.2లక్షలు ఉన్న భీమాని రూ.5లక్షలు పెంచి, చనిపోయిన కార్యకర్తలకు రూ10 వేలు ఖర్చులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు హుస్నాబాద్ నుండే ప్రారంభించడం సంతోషమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జి బత్తుల శ్రీనివాస్, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు దామెర సత్యం, మాజీ విద్యార్థి విభాగ రాష్ట్ర అధ్యక్షులు పర్లపల్లి రవీందర్, కోటి, మనోహర్ , బోల్లుమల్ల సదానందం, లొంక భాస్కర శర్మ రోడ్ల శ్రీధర్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్చరీ క్రీడల అధ్యక్ష పదవి గజ్వేల్‌కు దక్కడం గర్వకారణం

- రాజుకున్న క్రీడా అనుభవంతోనే పదవి దక్కింది
- ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

సంపన్న వర్గాలకే పరిమితమైన ఆర్చరీ క్రీడల రాష్ట్ర స్థాయి అధ్యక్ష బాధ్యతలు గ్రామీణ ప్రాంత న్యాయవాది, టివైఆర్ ఫౌండేషన్ చైర్మన్ తలకొక్కుల రాజుకు దక్కడం గజ్వేల్ కే గర్వకారణమని ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి గుప్త పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన అభినందన సభలో వారు ప్రసంగించారు. ప్రధాన క్రీడలలో ఆర్చరీ క్రీడ ఒకటి కాగా, పట్టణ ప్రాంతాలకే పరిమితమైన ఈ క్రీడ గ్రామీణ స్థాయికి విస్తరింప చేయాలని ఆకాంక్షించారు. ప్రాచీన యుగం, రాజుల కాలంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన విలువిద్య అంతరించిపోగా, ఈ క్రీడకు సాంకేతికత జోడించడంతో రాజవంశీకులు, ఉన్నత వర్గాలు, ధనికులు, సంపన్న వర్గాలకు పరిమితమైందన్నారు. అయితే విస్తృత సామాజిక సేవలు, ప్రజా కళలు పోషిస్తూ వన్నె తెస్తున్న సామాన్య వ్యక్తి రాజుకు ఈ ఉన్నత పదవి దక్కడం హర్షనీయమని, తద్వారా ఆయన నేతృత్వంలో రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలకు ఈ క్రీడ విస్తరిస్తుందనే నమ్మకం తమకు ఉన్నట్లు తెలిపారు. అనంతరం రాష్ట్ర ఆర్చరీ అసోసియేషన్ చైర్మన్‌గా నియమితులైన తలకొక్కుల రాజు



మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తూ గజ్వేల్‌లో మొట్టమొదటగా శిక్షణా కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. అయితే ప్రపంచ స్థాయిలో ఆర్చరీ క్రీడకు అత్యంత ప్రాధాన్యత ఉండగా, ఒలింపిక్ క్రీడల్లో దీపిక కుమారి, లింభారాం వంటి క్రీడాకారులు ప్రతిభ చాటుకు దేశానికి మంచి పేరు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్చరీ అధ్యక్ష పదవి దక్కడం మరింత బాధ్యత పెంచిందని పేర్కొన్నారు. అయితే గజ్వేల్ ప్రాంత క్రీడాకారులు, నిరుద్యోగులు, విద్యార్థులు ఈ అద్భుత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గేయ రచయిత మాస్టార్జి తాను రచించిన పాట చదివించగా, మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయోద్దీన్, కౌన్సిలర్లు వంటేరు గోపాల్ రెడ్డి, ఉప్పల మెట్టయ్య గుప్త, భాగ్యలక్ష్మి దుర్గాప్రసాద్, బొగ్గుల చందు, ఐఎంఏ నాయకులు డాక్టర్ లింగం, నిర్వాహకులు రమణాకర్ శివసాగర్, పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్న సీఎం రేవంత్ రెడ్డి

- డీసీసీ అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

ప్రభుత్వ విద్యారంగాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రోత్సహిస్తున్నారని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తూముకుంట నర్సారెడ్డి తెలిపారు. గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ కలిసి గజ్వేల్‌లోని బాలికల హాస్టల్లో (హబ్) రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఆదివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ విద్యకు దీటుగా ప్రభుత్వ విద్యను తీర్చిదిద్దుతో సీఎం రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవడంతో పేద విద్యార్థుల నుంచి హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. గతానికి భిన్నంగా డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని తెలిపారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఇప్పటికే 50 వేల పైగా ఉద్యోగాలు భర్తీ చేయగా, జీర్ణించుకోలేని కేటీఆర్, హరీష్ రావు తమ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణ, వార్డెన్స్ లక్ష్మి, స్వప్న జగదేవపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, ఏఎంసి డైరెక్టర్ నర్సింహారెడ్డి, వహీద్, యాదయ్య, మున్సిపల్ కార్పొరేషన్ సభ్యులు ఎంసెట్ రాజు, నాయకులు సికిందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ నిరుద్యోగులు విమర్శలు మానుకోవాలి

- మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ఓబీఆర్ఎస్ నేత రాజకీయ నిరుద్యోగిగా మారి పిచ్చివాడిలా మాట్లాడు తున్నారని గజ్వేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎన్నడు ఎన్నికల్లో గెలవలేక అధికార పార్టీలో చేరితే ఆ పార్టీ ఓడిపోవడం తర్వాత కాంగ్రెస్‌లో చేరటానికి ప్రయత్నిస్తే కాంగ్రెస్ తలుపులు మూయడంతో మతిస్థిమితం కోల్పోయి కాంగ్రెస్‌పై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. గత పది సంవత్సరాల టీఆర్ఎస్ హయాంలో అంత దళారులకు అమ్ముడుపోయిన విషయం నాయకులు తెలుసుకోవా లన్నారు మరోసారి అర్థం పదం లేని ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని సిసిఐకి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి సంబంధం ఉందా అని నిలదీశారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొన్ని రాష్ట్రాలలో మాత్రమే పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా, రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ఆ పాపాన్ని అంటగడుతూ మాట్లాడడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో మంచి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తిట్టిపోయడమే ప్రతాప్ రెడ్డి లక్ష్యంగా కనిపిస్తోందని విమర్శించారు. అన్నదాతలకు అండగా నిలుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూసి జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మార్కెట్ డైరెక్టర్ నరసింహారెడ్డి, వహీద్ ఉన్నారు.

మహిళల రక్షణ, సైబర్ నేరాల నియంత్రణకు పెద్దపీట

- ఏసిపి పురుషోత్తం రెడ్డి

నవతెలంగాణ- రాయపోల్

మహిళల రక్షణకు సైబర్ నేరాల నియంత్రణకు పోలీస్ శాఖ పెద్దపీట వేస్తుందని యువత గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలకు బానిస కావద్దని గజ్వేల్ ఏసిపి పురుషోత్తం రెడ్డి అన్నారు. శనివారం రాత్రి రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల రక్షణ, ప్రజలకు సెన్సాఫ్ సెక్యూరిటీ భద్రతాభావం కలిగించడం గురించి కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఎలాంటి పేపర్లులేని 32 ద్విచక్ర వాహనాలు, డీసీఎంలు 04, ఆటోలు 04,కార్లు 02, సీజ్ చేయడం జరిగిందన్నారు. నార్కటిక్స్ డాగ్స్ అనుమానస్పద ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. మహిళల రక్షణకు చట్టాలు పెద్దపీట వేయడం జరిగిందన్నారు. నూతన చట్టాల గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాల న్నారు. అత్యాధునిక టెక్నాలజీ టీఎస్ కాప్ అధునాతన యాప్ ద్వారా ఫేషియల్ రికగ్నిషన్ సిస్టం ద్వారా అనుమానితుల ఫోటో తీసి చెక్ చేయడం ద్వారా ఎవరైనా పాత నేరస్తులు నేరం చేసి ఉంటే వెంటనే వారి ఫోటో వారి బయోడేటా వారు చేసిన నేరం వివరాలు క్షణంలోనే తెలిసిపోతాయి. వాహనదారులు తప్ప నిసరిగా ధ్రువపత్రాలు కలిగి ఉండాలి. ప్రభుత్వం నిషేధి ంచిన గంజాయి గుట్కాలు అమ్మి నట్లు సమాచా రం తెలిస్తే వెం టనే స్థానిక పోలీ స్ స్టేషన్లో తెల పాలని లేదా డయల్ 100 కాల్‌కు ఫోన్ చేసినా వెంటనే చ ర్యలు చేపడతామన్నారు. సైబర్ నేరాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. టోల్ ఫ్రీ నెంబర్లు 1930 డయల్ 100, కాల్ చేయండి తదితర అంశాల గురించి గ్రామస్తులకు



తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో సిఐలు షేక్ లతీఫ్, మహేందర్ రెడ్డి, మురళి, ఎస్ఐలు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత



నవతెలంగాణ-గజ్వేల్

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని గజ్వేల్ విద్యుత్ శాఖ డిఈ భాను ప్రకాష్ అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గజ్వేల్ డివిజన్ కార్యాలయంతో పాటు గజ్వేల్ సబ్ డివిజన్‌లో ఆయా సమస్యలపై వినియోగదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్ డివిజన్ పరిధిలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. వినియోదారులకు ఏ సమస్య లేకుండా చూసుకోవడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏడీ జగదీశ్ ఆర్య, ములుగు ఏడీ జి శ్రీనివాస్, తుక్కాపూర్ ఏడీ.శ్రీనివాస్, డివిజన్ పరిధిలోని ఆయా మండలాల ఏఈలు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ములుగు, తుక్కాపూర్ సబ్‌స్టేషన్ల వద్ద కూడా అవగాహన సదస్సు నిర్వహించారు.

విద్యుత్ సమస్యల పట్ల తక్షణ పరిష్కారం

- ఏడీఈ గంగాధర్

నవతెలంగాణ-దుబ్బాక

ప్రతి ఏటా నవంబర్ 3న "విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని" నిర్వహించడం జరుగుతుందని, విద్యుత్ సమస్యల పట్ల తక్షణ పరిష్కారం చేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని దుబ్బాక విద్యుత్తు ఏడీఈ సీహెచ్.గంగాధర్ తెలిపారు. ఆదివారం దుబ్బాకలోని ఏడీఈ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన విద్యుత్ వినియోదారుల దినోత్సవంలో భాగంగా ఇద్దరు రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. వారు మాట్లాడుతూ, విద్యుత్ వినియోగదారుల సమస్యల పట్ల తక్షణ పరిష్కారం చూపుతూ.. పలు సూచనలు చేయడం జరిగిందన్నారు. విద్యుత్తును పొదుపుగా వాడాలని.. చౌర్యానికి పాల్పడితే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్బర్ పేట భూంపల్లి, దుబ్బాక టౌన్, దుబ్బాక రూరల్, మిరుదొడ్డి విద్యుత్తు ఏఈలు కనకయ్య, కనకరాజు, జయకృష్ణ, శ్రీకాంత్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

